


తిరుమల కొండపై వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ సోదాలు వేగవంతంగా చేస్తోంది. ఐదేళ్లలో విమర్శలొచ్చిన వాటిపైనే కాకుండా ప్రతి విభాగాన్నీ తనిఖీ చేయడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బందిని, బదిలీపై వెళ్లిన వారినీ ప్రశ్నిస్తున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల జారీ వంటి వాటిపై ఆరా తీసి.. స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తూ.. ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలపై విజిలెన్స్

వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సోదాలు

టీటీడీలో మొదలైన ప్రకంపనలు

టికెట్లపైనే ఫోకస్

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు, వైసీపీ నాయకులకు కేటాయించిన వీఐపీ బ్రేక్, ప్రొటోకాల్ దర్శనాలను పరిమితికి మించి ఎవరికి ఎన్ని ఇచ్చారనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటికే తిరుమలలోని ఈవో కార్యాలయంలో విజిలెన్స్ బృందం పలుమార్లు తనిఖీ చేసి.. ఇద్దరు ముఖ్య అధికారుల స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. అలాగే కేటాయింపులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా సేకరించినట్టు సమాచారం. మరోవైపు వైకుంఠం కాంప్లెక్స్ వద్దనున్న ఆర్జితం కార్యాలయంలోని ఐటీ విభాగంలోనూ సోదాలు చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే రికార్డులను తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్న క్రమంలో స్వయంగా వెళ్లి డేటాను పొందినట్టు తెలుస్తోంది. అలాగే శ్రీవాణి ట్రస్టు ద్వారా కేటాయించే టికెట్ల కౌంటర్లను కూడా తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని టికెట్లు ఇస్తున్నారు, ఎంత నిధులు వస్తున్నాయి, అవి ఏ ఖాతాలో పడుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూల తయారీకి కొనుగోలు చేస్తున్న ముడి సరుకుల కొనుగోళ్లలో అక్రమాలు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించాల్సిన అధికారికి అర్హత ఉందా, లేదా, క్వాలిటీ కంట్రోల్ వింగ్, ల్యాబ్ టెస్టింగ్, హెల్త్ అధికారుల తీరును పరిశీలించి ముఖ్య అంశాలను నమోదు చేశారు. ఎస్టేట్ విభాగం ద్వారా అతిథిగృహాల నిర్మాణం, దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్, నగదు బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, ఆభరణాల భద్రత, టీటీడీ బోర్డులో టేబుల్ అజెండాగా పనులకు నిధుల మళ్లింపు వంటిపైనా పరిశీలన చేశారు.

ఇంజనీరింగ్ పనులపై..

వైసీపీ ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. కమీషన్ల కోసం నిబంధనలను ఉల్లంఘించి మరీ భారీగా ఇంజనీరింగ్ పనులకు నిధులు మళ్లించారనే ఆరోపణలున్నాయి. దాంతో స్టేట్ విజిలెన్స్ బృందం ప్రత్యేకంగా ఇంజనీరింగ్ విభాగంలో సోదాలు చేసింది. ఏ పనులకు నిధులు కేటాయించారు, నిజంగా నిధులు కేటాయించాల్సిన అవసరముందా, ఎంత కేటాయించారు, నిజంగానే కమీషన్లు పొందారా వంటి వాటిపై కూడా విజిలెన్స్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కోట్లాది రూపాయల పనులను కొందరికే కట్టబెట్టడం, ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు,గత బోర్డు సభ్యులకు ఎలాంటి సంబంధాలు ఉన్నాయి వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది.

గత సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో టీటీడీలో తీవ్రస్థాయిలో అవినీతి కుంభకోణాలు జరిగాయనే విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, వ్యవస్థలను నాశనం చేశారంటూ ఆగ్రహించారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతామని ప్రకటించారు. ఈక్రమంలో 15 రోజులుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన స్టేట్ విజిలెన్స్ కమిటీ.. టీటీడీలో సోదాలు చేయడంతో ప్రకంపనలు మొదలయ్యాయి. సీనియర్ ఎస్పీ కరీముల్లా ఆధ్వర్యంలో దాదాపు 40 మంది సభ్యులతో కూడిన స్టేట్ విజిలెన్స్ బృందం టీటీడీలోని అన్ని విభాగాలను తనిఖీ చేస్తోంది.

కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు

తనిఖీలు, రికార్డుల స్వాధీనం, స్టేట్‌మెంట్ల సేకరణతో ఐదేళ్లపాటు టీటీడీలోని కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నాయకులు, ఉన్నతాధికారులు బాగానే ఉన్నారని, తమకు ఏ ఆపద వస్తుందో తెలీక సతమతమవుతున్నారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి సన్నిహితంగా ఉండి.. ప్రతి ఫైల్‌ను ముందుకు నడిపించిన అధికారులు ఇప్పుడు విజిలెన్స్ సోదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు సమాచారం.

ప్రక్షాళన దైవానుగ్రహం

టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై కొరడా ఝళిపించేలా సీనియర్ అధికారులతో రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయడం దైవానుగ్రహం. దీనికి శ్రీవారి భక్తుడిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మాజీ ఈవో ధర్మారెడ్డి కార్యాలయం కేంద్రంగా దందా నడిపించిన అధికారుల వ్యవహారంపై, ఆదాయానికి మించిన ఆస్తుల సంపాదన, సమగ్ర సమాచార పత్రాలను ఆదివారం విజిలెన్స్ ఎస్పీకి అందజేశా. ఐదేళ్లలో ధార్మిక సంస్థకు జరిగిన నష్టాన్ని వివరించా. గతంలో నేను పంపిన సమాచారం ఆధారంగానే సీఎం చంద్రబాబు విజిలెన్స్ బృందాన్ని పంపారు. ధర్మారెడ్డికి సంబంధించిన కొందరు భజనపరులు రికార్డులను మాయం చేసే కుట్రలు చేస్తున్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరా. కొంతమంది అధికారులు, అధికారపార్టీ నాయకులు సొంత లాభాల కోసం ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల టెండర్లు పిలవడంలో కీలకపాత్ర పోషించిన సూత్రధారులు, పాత్రధారుల వివరాలను విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లా.

- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

క్రీడారంగం పురోగమించేనా?

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

వైసీపీ హయాంలో క్రీడారంగం జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అందుబాటులో ఉన్న క్రీడాంశాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుపరం చేయడంతో పేదలైతే క్రీడలను మరచిపోయారు. నూతన ప్రభుత్వ హయాంలో అయినా క్రీడారంగం పురోభివృద్ధి చెందనుందా..? ఆ దిశగా చర్యలు చేపట్టనుందా..? అంటే ఔననే సంకేతాలు జిల్లా యంత్రాంగం ద్వారా అందుతున్నాయి.

- తిరుపతి(క్రీడలు)



చంద్రగిరిలో ఆగిపోయిన క్రీడా ప్రాంగణం

జిల్లా కేంద్రమైన తిరుపతిలో దాదాపు 20 ఎకరాల్లో శ్రీనివాస క్రీడా సముదాయం ఉంది. ఇందులో కార్యాలయం, ఇండోర్ స్టేడియం (షటిల్‌బ్యాడ్మింటన్, జిమ్, యోగా, బాక్సింగ్ క్రీడలకు అనుకూలంగా ఉంది). వెలుపల ఫ్లడ్‌లైట్లతో కూడిన రెండు టెన్నిస్ కోర్టులు, స్కేటింగ్ రింగ్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్‌నెట్ ప్రాక్టీసు స్థలాలున్నాయి. తాత్కాలిక వసతుల మినహా శాశ్వత, అధునాతన సదుపాయాలు లేవు. అలాగే శ్రీకాళహస్తి, సత్యవేడులలో అరకొర ఏర్పాట్లతో క్రీడా ప్రాంగణాలు మాత్రమే ఉన్నాయి.

కోచ్‌లు, సిబ్బంది కొరత

హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, వాలీబాల్, జూడో, స్విమ్మింగ్, స్కేటింగ్‌లకు మాత్రమే కోచ్‌లున్నారు. షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, జిమ్నాస్టిక్, ఖోఖో, అథ్లెటిక్, క్రికెట్ అంశాలకు శిక్షకులు కరువయ్యారు. దీంతోపాటుగా గ్రౌండ్స్‌మెన్స్, ఆఫీసు అటెండర్లు, స్విమ్మింగ్ పూల్ లైఫ్‌గార్డ్స్, స్వీపర్లు, వాచ్‌మెన్ లేకుండా క్రీడా ప్రాంగణాలు కొనసాగుతుండడం గమనార్హం.

ప్రతిపాదనలతో సరి

2022లో తమిళనాడు తరహా జిల్లావ్యాప్తంగా అకాడమీలు, క్రీడా వసతి గృహాల ఏర్పాటు అన్నది ప్రతిపాదనలకే పరిమితమైంది. రూ.52లక్షలతో శ్రీనివాస క్రీడా సముదాయంలో వాణిజ్యసముదాయం నిర్మాణానికి అనుమతులు వచ్చినా నిధులు విడుదల కాలేదు. ఔట్‌డోర్ మైదానాల ఏర్పాటుకు చేసిన ప్రతిపాదన కూడా మరుగున పడిపోయింది. దీంతో డిస్ట్రిక్ట్ అథారిటీ కోచ్‌లు బయట పాఠశాలలు, కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. పే అండ్ ప్లే విధానంతో వసూలైన నగదు కూడా నేరుగా శాప్‌కు చేరడంతో జిల్లా క్రీడాభివృద్ధి కుంటుపడింది. మూడేళ్ల క్రితం అప్పటి పాలకులు స్వార్థంతో ప్రవేశపెట్టిన ఈ విధానం నిష్ప్రయోజనంగానే మిగిలిపోయింది. జిల్లా నుంచి ఏడాదికి దాదాపు రూ.50లక్షల వరకు శాప్‌ఖాతాలో జమ అవుతున్నా.. అక్కడినుంచి వచ్చే నిధులు మాత్రం రూ.18లక్షలే. దీనివల్లే క్రీడారంగం అభివృద్ధి చెందలేకపోతోందని పలువురి క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం.

అర్ధంతరంగా ఆగిన పనులు

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రగిరిలో రూ.2.1కోట్లతో ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం ఏర్పాటైంది. అయితే ప్రభుత్వం మారగానే అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ మొండిగోడలతో దర్శనమిస్తోంది. ప్రాంగణం కూడా నిరుపయోగంగా ఉంటోంది.

కోచ్‌లకు 4నెలలుగా జీతాల్లేవ్


జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కోచ్‌లకు నాలుగు నెలలుగా జీతాలు రాలేదు. దాంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిపోయింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా ఒకరు, శాప్ కోచ్‌లుగా ముగ్గురు (క్రికెట్, టెన్నిస్, హాకీ), ఔట్ సోర్సింగ్‌లో (జూడో, ఫుట్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, హాకీ), పే అండ్ ప్లేలో (వాలీబాల్, స్కేటింగ్, రెజ్లింగ్)మొత్తం డజను మంది కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారు. కాగా ఖేలో ఇండియా స్కీమ్, శాప్, పే అండ్ ప్లే కోచ్‌లకు మాత్రం నెల నెలా జీతాలు సక్రమంగా అందుతున్నాయి. ఔట్‌సోర్సింగ్ కోచ్‌లకు (ఒక్కొక్కరికి రూ.19,500చొప్పున) మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన జీతాలు చెల్లించలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆప్కాస్ పరిధిలో ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. ఆప్కాస్‌కు మార్చికే కాలపరిమితి ముగిసింది. కొనసాగింపునకు సిఫార్సు చేసినా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సాధ్యపడలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడి గత నెల చివర్లో ఆప్కాస్ సంస్థకు మరో ఏడాది కాలపరిమితి పొడిగింపు లభించింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఇకనైనా తమకు జీతాలు చెల్లించాలని ఆయా కోచ్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి ఇసుక లభ్యత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7: జిల్లాలో గుర్తించిన స్టాక్ పాయింట్లలో సోమవారం నుంచి ఇసుక లభించనుంది. నూతన విధానంలో ఇసుక కావాల్సిన వారు డీఎంజీ వెబ్‌సైట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్(ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే) ద్వారా చెల్లించాలి. స్టాక్ పాయింట్ వద్ద రశీదు చూపిస్తే ముందు వచ్చిన వారికి ముందుగా అన్న ప్రాతిపదికన ఇసుక కేటాయింపులు జరుగుతాయి. ఆధార్ కార్డు ప్రాతిపదికగా రోజుకు ఒక వ్యక్తికి గరిష్టంగా 20 టన్నుల ఇసుక మాత్రమే ఇస్తారు.

స్టాక్ పాయింట్లు.. ధరలు

శ్రీకాళహస్తి డివిజన్‌లో సుబ్బానాయుడు కండ్రిగలో రెండు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. మెట్రిక్ టన్ను ఇసుక రూ.200 నిర్ణయించారు. పిచ్చాటూరు మండలం అడవి కొడియంబేడు వద్ద టన్నుకు రూ.200, సూళ్లూరుపేట డివిజన్‌లో డీవీసత్రం మామిళ్లపాడు వద్ద స్టాక్‌పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.465గా నిర్ణయించారు. గూడూరు డివిజన్‌లో వెంకటగిరి మండలం మొగళ్లగుంట స్టాక్ పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.590గా ధర నిర్ణయించారు.



గదుల దళారీపై లోతుగా విచారణ

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి):తిరుమల లో వసతి గదుల డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ కొత్తరకం అక్రమంతో పట్టుబడిన దళారీ నవకిషోర్‌ను తిరుమల టూటౌన్ పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. భక్తుల ఆధార్ జిరాక్స్ తీసుకుని ఫొటో మార్పిడితో గదులు పొందుతూ బ్లాక్‌లో విక్రయిస్తున్న ఇతడిని విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. నెల వ్యవధిలోనే దాదాపు 28 గదులు పొందిన ఈదళారీపై కేసు నమోదు చేసిన టూటౌన్ సీఐ సత్యనారాయణ ఆదివారం విచారించారు. గదుల అక్రమాలకు పాల్పడుతున్న దళారులను పట్టుకునేందుకు దాదాపు 25 మందికిపైగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక దళారీ రెండు నుంచి ఐదు ఫోన్ నెంబర్లు వినియోగిస్తున్నట్టు విచారణలో తేలింది. ప్రభుత్వం మారిన వెంటనే తిరుమలలో దళారీలపై ఉక్కుపాదం మోపింది. విజిలెన్స్‌తోపాటు పోలీసు విభాగం కూడా చర్యలు తీసుకుంటోంది. తొలుత గదుల దళారీలను పూర్తిగా అరికట్టేలా వివిధ రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



దళారీని ప్రశ్నిస్తున్న సీఐ సత్యనారాయణ

రేషన్ మాఫియాకు చెక్ పడేనా?

రేణిగుంట, శ్రీకాళహస్తి, నాయుడుపేట కేంద్రాలుగా దందా

చౌక బియ్యాన్ని కిలో రూ.9-10కి కొని పాలిష్ పట్టించి రూ.30కి విక్రయం

తిరుపతి(నేరవిభాగం), జూలై 7: జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట పడటం లేదు. గోదాముల వద్ద నుంచే ఈ దందా కొనసాగుతోంది. తరుగు రూపంలో భారీగా గోదాముల నుంచే చౌక బియ్యం మాయం చేస్తున్నారు. డీలర్లకు సరఫరా చేస్తున్న సంచుల్లో తూకం తగ్గుతోందని ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు జిల్లాలో ఎక్కడ రేషన్ బియ్యం పట్టుబడినా మూలాలు మాత్రం రేణిగుంట, నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో ఉంటున్నాయి. ఈ వ్యవహారంలో వైసీపీలోని కొంతమంది కీలక నేతలు ఉండటంతో అధికారులు ఐదేళ్లుగా పట్టించుకోక పోవడంతో మాఫియాకు అడ్డుకట్ట పడటం లేదు. బియ్యం బాగా లేవని కొందరు కార్డుదారులు, డబ్బు అవసరాల కోసం మరికొందరు పేదలు.. ఈ మాఫియా సభ్యులకు కిలో బియ్యాన్ని రూ.9-10కి చొప్పున అమ్ముతున్నారు. ఇలా కొన్న బియ్యాన్ని పాలిష్ పట్టించి.. తిరిగి మార్కెట్లో రూ.30కి విక్రయిస్తూ రేషన్ మాఫియా సొమ్ము చేసుకుంటోంది.



రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం (ఫైల్ ఫొటో)

తూతూమంత్రంగా తనిఖీలు

అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిన్నమొన్నటి వరకు రేణిగుంట మీదుగా సాగిన దందా.. ఇప్పుడు శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదుగా సాగుతున్నట్లు తెలిసింది. ఇక్కడ సేకరించిన బియ్యాన్ని రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. తిరుపతి నగరంలో ప్రధానంగా రైల్వే కాలనీ, మధురానగర్, శివజ్యోతి నగర్, బాలాజీకాలనీ, పేరూరు, ఎస్‌టీవీ కాలనీ, ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి ఎక్కువగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి.. అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్క తిరుపతి నుంచే నెలకు రెండు నుంచి మూడు టన్నుల బియ్యం అక్రమంగా తరలిస్తున్నారంటే జిల్లాలో ఈ దందా ఏ మేరకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ రేషన్ మాఫియాకు చెక్ పెట్టాల్సి ఉంది.

రుయాలో స్టాఫ్‌నర్సుపై రోగి దాడి

- తలపై తీవ్రగాయం

తిరుపతి(వైద్యం), జూలై 7: స్టాఫ్ నర్సుపై ఓ రోగి దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి తిరుపతిలోని రుయాస్పత్రిలో జరిగింది. మదనపల్లె మండలం రాజానగర్‌కి చెందిన దుర్గాప్రసాద్ విషం తాగడంతో నాలుగు రోజుల కిందట కుటుంబీకులు రుయాకు తీసుకొచ్చారు. ఇక్కడి ఏఎంసీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. శనివారం నాటికి కోలుకున్న అతనికి రాత్రి అట్రాసిన్ అనే ఇంజక్షను వేశారు. అప్పటినుంచి మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా ప్రవరిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇదే వార్డులోకి స్టాఫ్‌నర్సు యశోద విధులకు హాజరయ్యారు. రోగులకు ఇంజక్షన్లు వేసి.. తన కుర్చీలో కూర్చొన్నారు. ఆ సమయంలో దుర్గాప్రసాద్ వెనుక నుంచి సెలైను పెట్టే ఐవీ స్టాండు తీసి తలపై బలంగా కొట్టాడు. ఆమెకు తీవ్రగాయమైంది. గమనించిన సెక్యూరిటీ వచ్చి అతడిని పట్టుకుని పక్క గదిలోకి తీసుకెళ్లారు. బాధితురాలికి వైద్యులు ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ రవిప్రభు వచ్చి.. ఘటనపై విచారణ చేపట్టారు. తొలుత వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చినా రోగికి మతిస్థిమితం లేదనే కారణంతో ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ విషయం బయటకు రానీయకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, తమకు రక్షణ లేకుండా పోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనిపై సోమవారం అధికారులను నిలదీసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది.





బాధితురాలికి చికిత్స - సెక్యూరిటీ అదుపులో దుర్గాప్రసాద్

అలిపిరి కాలినడకన ఓవర్‌పాస్ నిర్మాణం జరిగేనా?

మంగళం, జూలై 7: తిరుమలకు అలిపిరి కాలినడక దారిలో వెళ్లే శ్రీవారి భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ నిర్మించాలనుకున్న ఓవర్ పాస్(ఫ్లైవంతెన) నిర్మాణానికి ఏపీలో కొలువుదీరిన ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. చిరుతపులుల దాడుల్లో చిన్నారి మృత్యువాత పడిన ఘటన గతంలో సంచలనం రేపింది. 2023 జూన్ 22న అలిపిరి కాలినడక దారిలో ఏడో మైలు వద్ద చిరుతపుల్లి కౌశిక్ అనే బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. బాలుడు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలకే ఆగస్టు 11వ తేదీన నడిచి వెళుతున్న లక్షిత అనే బాలికపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో చిరుత దాడి చేసి.. సమీప అటవీప్రాంతంలోకి లాక్కెళ్లి చంపేసింది. దాంతో అప్పటి టీటీడీ అధికారులు సాయంత్రం ఐదు గంటల తర్వాత కాలినడక దారిని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఏర్పాటు చేసిన బోన్లలో ఆరు చిరుతపులులు పట్టుబడ్డాయి. అయితే కాలినడక దారిలో భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని చెబుతూ మైకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అలాగే రక్షణ కోసం భక్తులకు వెదురు కర్రలు కూడా అందజేసింది. ఈ సమయంలోనే ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఓవర్‌పాస్ (ఫ్లైవంతెన) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. చిన్నారులపై చిరుతపులులు దాడి చేసిన సంఘటనా స్థలాన్ని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. ఓవర్‌పాస్‌తోపాటు జంతువులు తిరిగేందుకు వీలుగా అండర్‌పాస్.. అలాగే కాలినడక మార్గానికి రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిపుణుల బృందం సూచించింది. దీనికి దాదాపు రూ.50కోట్లు ఖర్చు అవుతుందని అంచనా కూడా వేసింది. ఈ వంతెన వల్ల జంతువుల నుంచి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. అలాగే వన్యప్రాణులకు కూడా భక్తుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంది. దాదాపు ఎనిమిది నెలల క్రితమే ప్రతిపాదనలు టీటీడీకి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అందజేసింది. కానీ టీటీడీ ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికైనా ఈ ప్రతిపాదనలపై టీటీడీ తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.





ఓవర్ పాస్ నిర్మాణం జరగాల్సిన ప్రదేశం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 77,995 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 30,250 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఘాట్‌రోడ్డులో నెల్లూరు జిల్లావాసి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం నెల్లూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. డీఎస్పీ శ్రీనివాసాచారి వివరాల మేరకు.. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే ఘాట్‌రోడ్డులోని 58వ మలుపు సమీపంలోని అడవిలో 35 వయస్సు కలిగిన వ్యక్తి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. తొలుత ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా భావించారు. మృతుడి షర్ట్ కాలర్‌పైనున్న లేబుల్ వివరాలకు అనుగుణంగా దర్యాప్తు మొదలుపెట్టారు. లేబుల్‌పై గల టైలర్ నెంబరుకు ఫోన్ చేసి ఫొటో పంపి సమీపంలోని ఎస్ఐ ద్వారా వివరాలు సేకరించారు. మృతుడు నెల్లూరు జిలా చేజర్ల మండలం పడమటికండ్రిక చెందిన ఎం భార్గవ్‌గా గుర్తించారు. అక్రమ సంబంధం, కుటుంబ కలహాలు వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు


అనురాధ పౌడ్వాల్

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రముఖ గాయని, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనురాధ పౌడ్వాల్, తెలంగాణ ఎంఎల్సీ సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంఎల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఐదేళ్లలో దళారులపై 279 కేసుల నమోదు

తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారి

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో తిరుమలలో దళారులపై 279 కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసాచారి ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. దర్శనం, వసతి, ప్రసాదాలు వంటి వాటి ద్వారా భక్తులను మోసగించిన వారిపై విజిలెన్స్ వింగ్ అధికారులు ఇచ్చిన వివరాల మేరకు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. కేసులకు సంబంధించి 589 మంది హాజరుకాగా 208 మందిని అరెస్ట్ చేశామన్నారు. 337మందికి 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చామన్నారు. మరో 26 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. 10 మందిని గుర్తించాల్సి ఉందన్నారు. ఎనిమిది మంది విషయంలో లీగల్ ఒపెనియన్ తీసుకుంటున్నామన్నారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు 12 కేసుల్లో నిందితులను గుర్తించాల్సి ఉందన్నారు. భక్తులను మోసగిస్తున్న దళారీలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. విజిలెన్స్ వింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ దళారీల వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. ఇప్పటికే సీఆర్వో, ఎంబీసీ34, వైకుంఠం క్యూకాంప్లెక్స్1, 2 వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్టు ఆయన వివరించారు.

శాస్త్రోక్తంగా వారాహి హోమం



రామచంద్రాపురం, జూలై 7: రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో ఆదివారం వారాహి హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మరకతశక్తి కాళి అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రెండవరోజు కిరాతక వారాహి దేవిగా అమ్మవారిని అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాల నడుమ అమ్మవారి ఊంజల్‌సేవ వైభంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలివచ్చారు.

నృత్యాభినయం..నయన మనోహరం



తిరుచానూరు, జూలై 7: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి రిషాస్నీ డ్యాన్స్ అకాడమీ(తిరుపతి) ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నయన మనోహరంగా సాగింది. మూషిక వాహన, భోశంభో, అదివో అల్లదివో, పుష్పాంజలి, వెంకటాచలనిలయం, వేయి నామాలవాడు తదితర కీర్తనలకు కళాకారులు రిషిశ్రీ, అవని, వినుక్తన, సాయి, అక్షర, నందన, వేద, సాగ్నిక ప్రదర్శించిన నృత్యాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

ఎంపీ దగ్గుమళ్లకు ఘన స్వాగతం


ఎంపీకి స్వాగతం పలుకుతున్న మాజీ సర్పంచ్ వేణు

చంద్రగిరి, జూలై 7: చిత్తూరు ఎంపీ దగ్గుమళ ప్రసాదరావుకు చంద్రగిరిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకారం చేశాక మొదటి సారిగా చిత్తూరు వస్తున్న ఆయనకు బుచ్చినాయుడుపల్లె మాజీ సర్పంచ్ వేణు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనం ర్యాలీగా రేణిగుంట ఎయిర్ పోర్టుకు వెళ్లారు. అక్కడ స్వాగతం పలికి వేణు పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సన్మానించారు. అక్కడ నుంచి చంద్రగిరి వరకు ఎంపీ కాన్వాయ్ ముందు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా నినాదాలు చేస్తూ చంద్రగిరికి చేరుకున్నారు. చంద్రగిరిలో టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోట్లూరి రామారావు ఆధ్వర్యంలో దళిత నాయకులు స్వాగతం పలికారు. మంగాపురం గురున్నాథం, బాలసుబ్రమణ్యం, శంకర్ మాదిగ, మండీరావు, దేశయ్య, సురేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బోల్తా పడిన లారీ



చంద్రగిరి, జూలై 7: మామండూరు సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం పేపర్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి నుంచి చిత్తూరు వైపు పేపర్ లోడ్ లారీ వెళ్తుండగా మామండూరు సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి ప్రమాదంలేదు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా దుర్యోధన వధ


భీముడు, దుర్యోధనుడి మధ్య యుద్ధ సన్నివేశం

భాకరాపేట, జూలై 7: భాకరాపేటలో మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దుర్యోధనుడు, భీముడు వేషదారులు మహాభారత ఘట్టాలను చక్కగా ఆవిష్కరించారు. కురుక్షేత్ర యుద్ధంలో అందరినీ పోగొట్టుకుని నీటి మడుగులో దాక్కుని శివుని కోసం ధ్యానం చేస్తున్న దుర్యోధనుడిని బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. యుద్ధం చివరిలో దుర్యోధనుడు తొడ భీముడు విరచడంతో దుర్యోధన వధ కార్యక్రమం ముగిసింది. అనంతరం దుర్యోధన బొమ్మను తీర్చిన మట్టి కోసం ప్రజలు ఎగబడ్డారు. దీనిని ఇంటిలో పెట్టుకుంటే మంచి జరుగుతుందని ప్రజల విశ్వాసం. అనంతరం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

10న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాద నీరాజనం వేదికపై ఈనెల 10వ తేదీన అయోధ్యకాండ 12వ విడత అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎస్వీ వేద విజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పాల్గొననున్నారు. అయోధ్యకాండలోని 45 నుంచి 49 సర్గలలోని 141 శ్లోకాలను పారాయణం చేస్తారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ శ్లోక పారాయణం చేస్తారు.

మరమ్మతులు లేక గుండె 'చెరువు'

- రెండున్నరేళ్ల క్రితం తాత్కాలిక చర్యలు
- ఎక్కడ గండి పడుతుందోనని ఆందోళన


శాశ్వత మరమ్మతులకు నోచుకోని చెరువు కట్ట

పాకాల, జూలై 7: సామిరెడ్డిపల్లె పాకాల పెద్దచెరువు కట్టకు ముప్పు ఏర్పడింది. 156 ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువు కట్ట రెండు కిలో మీటర్లకు పైగా ఉంటుంది. రెండున్నరేళ్ల క్రితం ఈ చెరువు కట్ట తెగిపోయే ప్రమాదముందని పరిసర పది గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పరిస్థితి నివేదించారు. కట్టకు మరమ్మతులు చేయించాలని కోరారు. నాటి ఆర్డీవో, తహశీల్దార్, ఎంపీపీ, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువు కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. మొరవ తెగ్గొట్టడంతో చెరువు నీరు దిగువకు దిగడంతో అప్పట్లో ప్రమాదం తప్పింది. కట్ట కుంగిన ప్రాంతంలో తాత్కాలికంగా ట్రాక్టర్లతో మట్టి పోయించి వదిలేశారు.తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువుకట్ట మరమ్మతుల ఊసే మరచిపోయారు. శాశ్వత పనులు చేపట్ట లేదు. వందలాది ఎకరాలకు సాగునీరు, పరిసర గ్రామాలకు తాగునీరు అందించే సామర్థ్యమున్న ఈ పెద్దచెరువు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయింది. కట్టకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కట్టకు ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువుకట్ట రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు సర్కారు ఊతం

- ఉచితంగా ఇంటర్ పాఠ్య, నోటుపుస్తకాలు, బ్యాగులు

తిరుపతి(విద్య), జూలై 7: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే పేద విద్యార్థులకు సర్కారు ఊతం ఇవ్వనుంది. సర్కారు కళాశాలల్లో పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగుల కిట్‌ను ఉచితంగా అందజేస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇండెంట్ కూడా పంపించాలని ఆదేశించడంతో జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన పుస్తకాల నివేదికను జిల్లానుంచి అధికారులు పంపారు. దీనికి సంబంధించి ఈనెల మూడో తేదీన జీవో జారీచేశారు. ఆమేరకు ప్రతి విద్యార్థికీ పాఠ్య పుస్తకాలతోపాటు 200 పేజీల ఆరు తెల్లపేపర్ నోట్‌బుక్స్, మరో ఆరు రూల్డ్ నోట్‌బుక్స్ మొత్తం 12 నోటు పుస్తకాలు, ఓ బ్యాగ్‌ను ఉచితంగా అందించనున్నారు.

15వేల మందికి లబ్ధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 11, 12 తరగతులు చదువుతున్న సుమారు 15వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు అధ్యాపకులూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు పుస్తకాలకు ఇండెంట్ పంపించామని డీవీఈవో విశ్వనాథ నాయక్ తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఈ నిర్ణయాన్ని తీసుకోవడం హర్షణీయమని జూనియర్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి పేర్కొన్నారు.



దేశాభివృద్ధికి పాటుపడుతున్న బీజేకేపీ

- ఏపీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 7: భారత దేశ అభివృద్ధికి, దేశ సమగ్రతకు భారతీయ జవాన్ కిసాన్ పార్టీ (బీజేకేపీ) పాటుపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కోండ్రు రాజేశ్వరరావు చెప్పారు. బీజేకేపీ రాష్ట్ర కమిటీ ప్రమాణోత్సవ కార్యక్రమం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. భారత శక్తిపీఠం పీఠాధిపతి భారతీనంద మహరాజ్, వారాహి పీఠాధిపతి రుద్ర స్వామి హాజరై ఆశీస్సులతో కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ సుదర్శి మోహనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రస్తుతం పార్టీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం ప్రమాణస్వీకారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కోండ్రు రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, కార్యదర్శిగా బి.శివప్రసాద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.కిషోర్ కుమార్, జి.కుప్పుస్వామి, సీహెచ్ శ్రావణ్‌కుమార్, ముక్కాల పాండురంగారావు, న్యాయ సలహాదారుడిగా ఎస్.రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.

గంగమ్మ గుడికి రండి

దేవదాయ శాఖ మంత్రికి ఆర్సీ ఆహ్వానం


మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని సత్కరిస్తున్న ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని సందర్శించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆలయ మాజీ ఛైర్మన్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆహ్వానించారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి నివాసంలో పార్టీ శ్రేణులతో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈసందర్భంగా గంగమ్మ ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలోనే తిరుమల శ్రీవారి దర్శనం కోసం వస్తున్నానని, అప్పుడే అమ్మవారి ఆలయాన్ని సందర్శిస్తానని మంత్రి చెప్పారు. ఆనంను కలిసినవారిలో నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, మణి నాయుడు, రవితేజ నాయుడు, బాలాజీ ఉన్నారు.

'దిశ' ఎందుకిలా?

పిటిషన్లు ఎక్కువ, పరిష్కారం తక్కువ



తిరుపతి(నేరవిభాగం), జూలై 7: గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళా పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటినే వైసీపీ అధికారంలోకి వచ్చాక దిశ స్టేషన్‌గా పేరు మార్చారు. ఈ నేపథ్యంలో జిల్లా మొత్తానికి తిరుపతి కేంద్రంగా దిశ స్టేషన్‌ను ఏర్పాటైంది. ఈ స్టేషన్‌కి ఓ డీఎస్పీ, ఓ సీఐ, ముగ్గురు ఎస్ఐ(ఓ మహిళ)లు, ఇద్దరు ఏఎస్ఐ (ఓ మహిళ)లు, ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు (ముగ్గురు మహిళలు), 30 మంది కానిస్టేబుళ్ల (13 మంది మహిళలు)ను కేటాయించారు. అయితే డీఎస్పీ పోస్టు మాత్రం ఖాళీగానే ఉంది.

కౌన్సెలింగ్ ఇలా..

దిశ స్టేషన్‌కు వచ్చిన పిటిషన్లను పరిశీలించాక పిటిషనర్‌ను, నిందితుడిని పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలి. దీని కోసం ప్రత్యేకంగా మహిళా కౌన్సెలింగ్ కేంద్రం బాలాజీ కాలనీలో ఏర్పాటు చేశారు. అక్కడ ఇద్దరు మహిళా పోలీసులు, సైకాలజిస్టు, మహిళా విశ్వవిద్యాలయం నుంచి పారా లీగల్ వలంటీరు, మహిళా సంఘాల నుంచి అనుభవజ్ఞులైన మహిళ.. ఇలా ఆరుగురు ప్రతి బుధవారం, శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మూడు నెలల పాటు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేకుంటే కేసు రిజిస్టర్ చేసి కోర్టుకు రెఫర్ చేస్తారు. మళ్లీ కోర్టులోనూ కౌన్సెలింగ్ ఇస్తారు. అప్పటికీ ప్రయోజనం లేకుంటే న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తారు.

పిటిషన్లు 5,925, పరిష్కారమైన కేసులు 140

ఐదేళ్లలో తిరుపతి దిశ స్టేషన్‌కు జిల్లా నలుమూలల నుంచి 5,925 పిటిషన్లు వచ్చాయి. అందులో తూతూ మంత్రంగా విచారణ జరిపి కేవలం 502 కేసులు మాత్రమే రిజిస్టర్ చేశారు. వీటిలోనూ 315 కేసులు మాత్రమే పరిష్కరించారు. ఈ లెక్కన దిశ స్టేషన్‌లో 30 శాతం మంది బాధితులకు న్యాయం జరుగుతున్న దాఖలాలు లేవని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తమకు న్యాయం జరిగేది అటుంచితే.. దిశ స్టేషన్ చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు.

పిటిషన్లు, కేసుల వివరాలిలా..

2019లో వచ్చిన పిటిషన్లు: 548
రిజిస్టర్ అయిన కేసులు: 45
పరిష్కరించినవి: 27
కోర్టులో ఉన్న కేసులు: 18

2020లో వచ్చిన పిటిషన్లు: 987
రిజిస్టర్ అయిన కేసులు: 71
విచారణ దశలో ఉన్నవి: 3
కోర్టుకు రెఫర్ చేసినవి: 68
పరిష్కరించినవి: 32
పెండింగ్: 36

2021లో వచ్చిన పిటిషన్లు: 1318
రిజిస్టర్ అయినవి: 95
విచారణ దశలో ఉన్నవి: 2
కోర్టు పరిధిలో ఉన్నవి: 56
పరిష్కరించినవి: 37

2022లో వచ్చిన పిటిషన్లు: 1286
రిజిస్టర్ అయిన కేసులు: 103
పరిష్కరించినవి: 19
కోర్టు పరిధిలో ఉన్నవి: 72
విచారణ దశలో ఉన్నవి: 12

2023లో వచ్చిన పిటిషన్లు: 1400
రిజిస్టర్ అయిన కేసులు: 134
పరిష్కరించినవి: 25
కోర్టు పరిధిలో ఉన్నవి: 109

2024లో వచ్చిన పిటిషన్లు: 386
రిజిస్టర్ అయిన కేసులు: 54
కోర్టుకు పంపినవి: 40
విచారణ దశలో ఉన్నవి: 14

మోదీ వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలి: మురుగన్


తిరుమల ఆలయం ముందు మురుగన్

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని శ్రీవారిని కోరుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం.. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడోసారి మోదీ ప్రభుత్వం రావడం చారిత్రక ఘట్టమని, కేంద్ర మంత్రివర్గంలో తమిళనాడు నుంచి తనకు అవకాశం కల్పించిన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, జూలై 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,861మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,311మంది భక్తులు దర్శించు కున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,791మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,263, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 329మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 245మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 79మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,682అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పెద్దిరెడ్డి అనుచరుడి అక్రమ కట్టడాల కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బార్ కట్టడాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుచానూరు, జూలై 7: ఎట్టకేలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడి అక్రమ కట్టడాలను అధికారులు ఆదివారం తొలగించారు. ఐదేళ్లుగా ఆయన అనుచరుడు తిరుచానూరు ముఖద్వారా సిందు జంక్షన్ ఫ్లైఓవర్ సమీపంలో శ్రీనివాసపురం పంచాయతీరోడ్డును ఆక్రమించి రాకపోకలను నిలిపివేసి మరీ బార్ కోసం అక్రమ కట్టడాలను నిర్మించాడు. ప్రశ్నించిన అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. అధికార యంత్రాంగం వారి ఒత్తిళ్లకు లోనై చూసీచూడనట్లు వ్యవహరించింది.. దీనిపై ఆంధ్రజ్యోతిలో బరితెగించిన పెద్దిరెడ్డి అనుచరుడు... నడిరోడ్డుపై బారు అనే శీర్షిక శనివారం వార్త ప్రచురితమైంది. వెంటనే అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను కూల్చివేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆదివారం వేకువజాము నుంచి శ్రీనివాసపురం పంచాయతీ కార్యదర్శి శివశంకరరాజు నేతృత్వంలో సిబ్బంది బార్ అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. మందుబాబుల కోసం ఏర్పాటు చేసిన బల్లలను, ఇనుప రేకులషెడ్‌ను కూడా తొలగించారు. మళ్లీ ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని నిర్వాహకులను హెచ్చరించారు. బార్ నిర్వాహకుడు వైసీపీ నేతల నుంచి ఒత్తిడి తెచ్చినా అధికారులు తలొగ్గలేదు. మాజీమంత్రి అనుచరుల నుంచి ఫోన్ వచ్చినా పట్టించుకోకుండా అక్రమ కట్టడాలను తొలగించి ఆ మార్గంలో రాకపోకలను పునరుద్ధరించారు.

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు సన్మానం



తిరుచానూరు, జూలై 7: తిరుచానూరు రోడ్డులోని గ్రాండ్‌రిడ్జ్ హోటల్‌లో చంద్రగిరి మండలం టీడీపీ యువత నాయకుడు దొండపాటి శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సత్కరించారు. ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కిరణ్ చౌదరి, అరసం రచయిత కోట పురుషోత్తం, కూరపాటి సుధాకర్ చౌదరి, మునికృష్ణమనాయుడు, సురేంద్రనాయుడు, ధనంజయనాయుడు, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, రాకేష్ పాల్గొనారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఎర్రావారిపాలెం, జూలై 7; మండలంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయ మాణిక్యం పంచాయతీలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సంఘం స్థూపం వద్ద జెండా ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పల్లెపాక నాగరాజ, నాయకులు అంజీ, పాపయ్య, హరి, బాబు, ప్రభాస్, రమేష్, ఓబులేశు నాగార్జున,హరి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



తిరుపతి రూరల్, జూలై 7: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఒడిస్సా ఛైర్ ఆధ్వర్యంలో ఆదివారం పూరి జగన్నాథస్వామి రథయాత్రను వైభవంగా నిర్వహించారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో తిరుపతి ఇస్కాన్‌మందిర్ వైస్‌ప్రెసిడెంట్ రూపేశ్వర్ చైతన్యప్రభు కలసి ఈయాత్రను ప్రారంభించారు. వర్సిటీ ప్రాంగణంలోని ఒడిస్సా ఛైర్ జగన్నాథ మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్ర నగరంలోని పలు వీధుల్లో కొనసాగింది. భక్తులు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అకడమిక్‌డీన్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ఒడిస్సా ఛైర్ అడ్వైజర్ శంకరనారాయణ, డైరెక్టర్ జ్ఞానరంజనపండా తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వైసీపీ నేతల అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7: బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఎన్టీఆర్ నగర్ సమీపంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.52వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. అరెస్టయిన వారు వరదయ్యపాళెం మండలానికి చెందిన వైసీపీ నాయకులుగా తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తుమ్మలగుంట చెరువును ఆరోగ్యశాలగా అభివృద్ధి చేశాం: చెవిరెడ్డి

తిరుపతి రూరల్, జూలై 7: తుమ్మలగుంట చెరువును ఆరోగ్యశాల (శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి స్పోర్ట్స్ పార్క్)గా తీర్చిదిద్దామని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. పార్కులో ఆదివారం మీడియాతో మాట్లాడారు. అప్పటి చిత్తూరు ఉమ్మడి జిల్లా కలెక్టర్ రవిచంద్ర సూచనలతో, సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి శాశ్వత నిర్మాణాలకు తావులేకుండా ఉత్తమ క్రీడామైదానంగా అభివృద్ధి చేశామని చెప్పారు. ఇక గోదావరి పుష్కరాల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ఆదర్శంగా తీసుకుని టెండర్ల ద్వారా తుడాపరిధిలోని చంద్రగిరి నియోజకవర్గంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. తాను ఇక్కడే ఉండడానికి పరిపాలకుడిని కాదని.. బతుకుదెరువుకోసం వేరే పనులు చేస్తుంటానని.. నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

పంట రుణాలు.. మరింత ఆలస్యం!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఎన్నికలు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం తదితర కారణాలతో పంట రుణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందిస్తుంది. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పాలక మండళ్లు రద్దయ్యాయి. కొత్త పాలకవర్గాలను నియమించాకే పంటరుణాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైంది. ఇప్పటికే వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పంటరుణాల మంజూర్లు చురుగ్గా కొనసాగాలి. ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ బ్యాంకు ద్వారా కూడా పంటరుణాలు అందలేదు. ఈ సంవత్సరం పంటరుణాల మంజూరుకు సంబంధించి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల, జిల్లా అధికారులు ఫిబ్రవరి నెలలో సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడి నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లాకేంద్రానికి చేరింది. ఎన్నికల కోడ్, ఫలితాల విడుదల, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, కలెక్టర్ల బదిలీలు తదితర కారణాలతో ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. 2023-24లో రూ.13వేల కోట్ల పంటరుణాల పంపిణీకి బ్యాంకర్ల కమిటీ లక్ష్యం నిర్ణయించగా, రూ.14వేల కోట్ల పంపిణీ జరిగినట్లు బ్యాంకువర్గాలు తెలిపాయి. ఈ సంవత్సంలో పంట రుణాల లక్ష్యంపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంటామని ఎల్డీఎం ఎ.హరీష్ ఆదివారం తెలిపారు.

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత

- ఆందోళనలో ఉన్నతాధికారులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 7: జిల్లా ఆర్టీసీ పరిధిలో కాలక్రమేణ డ్రైవర్ల కొరత తీవ్రతరమవుతోంది. దీనివల్ల రోజూ వంద బస్సులకుపైగా డిపోలకే పరిమితమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 11డిపోలు (తిరుమల, అలిపిరి, తిరుపతి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడు)న్నాయి. అన్ని డిపోలకు కలిపి 857 వివిధ రకాల బస్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నడపడానికి 2,100మంది డ్రైవర్లు ఉండేవారు. గత ఫిబ్రవరి నుంచి డ్రైవర్ల పదవీ విరమణ ప్రారంభమైంది. డిపోకు పది చొప్పున ఇప్పటికే సుమారుగా 250మంది వరకు పదవీ విరమణ చేశారు. వీరి స్థానాలు భర్తీ కాలేదు. దీనివల్ల తాత్కాలికంగా ఆన్‌కాల్ డ్రైవర్‌ను వినియోగించుకోవాల్సి వస్తోంది. అయితే ఈ పనికోసం తమకు ఇచ్చే గౌరవ వేతనం తక్కువగా ఉంటోందని ఆన్‌కాల్ డ్రైవర్లు నిలకడగా రావడం లేదు. దీనివల్ల 11 డిపోల్లో నిత్యం పది బస్సుల చొప్పున రోడ్డెక్కడం లేదు. ప్రధాన మార్గాలు, గ్రామాలకు బస్సుల ట్రిప్పులు తగ్గిపోతున్నాయి. తద్వారా పాతికవేల మంది ప్రయాణికులు ప్రజారవాణాను కోల్పోతున్నారు. విధిలేక ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి.. అధిక చార్జీలు చెల్లిస్తూ నష్టపోతున్నారు. ఇక రోజువారీ జిల్లా రాబడిలోనూ ఆర్టీసీకి దాదాపు రూ.25లక్షలు తగ్గుతోంది. ఈసమస్య ఉన్నతాధికారులను కలవరపెడుతోంది.



వర్షంలో తడుస్తూ బైక్‌లపై వెళుతున్న వాహన చోదకులు, రాత్రి కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జిల వద్ద నిలచిన నీరు

నగరంలో జోరు వర్షం

తిరుపతి అర్బన్, జూలై 7: అల్పపీడన ద్రోణి ప్రభావంతోపాటు రుతుపవనాలు తోడవడంతో ఆదివారం నగరంలో జోరు వర్షం కురిసింది. పగలంతా ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై రాత్రి 7.30నుంచి అరగంట పాటు జోరు వర్షం కురిసింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి బోల్తా పడ్డారు. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లపైకి చెత్తాచెదారాలు కొట్టుకొచ్చాయి. కూరగాయల మార్కెట్ చిత్తడిగా మారింది. ఆర్టీసీ బస్టాండు, రేణిగుంట రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, ప్రధాన కూడళ్లలో నీరు నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాత్రి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రవాణా శాఖలో సర్వర్ సమస్య

తిరుపతి (జీవకోన), జూలై 7: జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సర్వర్ సమస్యతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల రెండు పర్యాయాలు సర్వర్ సమస్య రావడంతో ఎల్‌ఎల్‌ఆర్, డీఎల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నిరీక్షణ తప్పడంలేదు. గంటల కొద్దీ వేచి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సర్వర్ అందుబాటులోకి లేకపోవడంతో మరుసటి రోజు మళ్లీ పరీక్షలకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో ఈ ప్రగతి సాఫ్ట్‌వేర్ రవాణాశాఖకు అందుబాటులో ఉండేది. అయితే దేశవ్యాప్తంగా ఒకే సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులో ఉంచాలని రవాణా శాఖ తలచింది. దీంతో నూతనంగా సారథి పరివాహన పోర్టల్‌లో డ్రైవింగ్ లైసెన్సులు, వాహన పరివాహన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. లైసెన్సులకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్ పూర్తిగా అందుబాటులో ఉన్నప్పటికీ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసే సాఫ్ట్‌వేర్‌లో మాత్రం సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. పాత వాహనాలకు సంబంధించిన పూర్తి డేటాను కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచలేదు. దీంతో పాత వాహనాలకు సంబంధించిన ప్రక్రియ చేసుకునే సమయంలో ఇబ్బందులు తప్పడంలేదు. టెక్నికల్ సమస్యలు వచ్చిన సమయంలో మోడిఫికేషన్ చేసినపుడు సమస్య ఏర్పడుతూనే ఉంది. మరోపక్క ఆధార్ సర్వర్లు డౌన్ అవ్వడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా కూడా అలాగే ఉంది. ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సు పరీక్షల కోసం, ఇతర సేవల కోసం హాజరయ్యే వాహనదారులకు ఎలాంటి నిరీక్షణ లేకుండా చూడాల్సిన బాధ్యత రవాణాశాఖ ఉన్నతాధికారులపై ఉంది.

ఈ రోడ్డులో వెళితే కింద పడాల్సిందే..!

● పట్టించుకోని అధికారులు



సుబ్బారెడ్డి నగర్‌లో నడిరోడ్డులో పెద్దగుంతలను తలపిస్తున్న దృశ్యం

తిరుపతి (జీవకోన), జూలై 7: తిరుపతి నగర పరిధిలోని సుబ్బారెడ్డి నగర్ ఒకటవ డివిజన్‌లో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. సుబ్బారెడ్డి నగర్ ముఖద్వారం (జిమ్ వద్ద) నుంచి రోడ్డు అంతా గుంతలమయంగా ఉంది. చిన్నపాటి వర్షం పడినా కూడా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఈ రోడ్లకు ఎలాంటి ప్యాచ్‌లు కూడా వేయలేదు. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాహనదారులు రాత్రి సమయాల్లో వాహనాలు నడిపేందుకు ఇబ్బందిపడుతున్నారు. సుబ్బారెడ్డినగర్‌లోని 22-6-65వ డోర్ నెంబరు వద్ద నడిరోడ్డులో పెద్దగుంత దర్శనమిస్తోంది. ఏ మాత్రం ఏమరపాటుగా వెళ్లినా బొక్క బోర్లా పడాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకముందే ఈ గుంతకు మరమ్మతులు చేయాల్సి ఉంది.

ఆక్రమణల్లో కాలువ భూములు

● నిలిచిపోయిన వ్యర్థాలు ● అవస్థల్లో 2వ వార్డు ప్రజలు



కొరమేనుగుంట సమీపాన ఉన్న ప్రధాన కాలువలో నిలిచిన చెత్తాచెదారం, ఆటోనగర్‌లోని సైడుకాలువల్లో నిలిచిన మురుగునీరు

తిరుపతి(వైద్యం), జూలై 7: నగర పరిధిలోని 2వ వార్డులో పారిశుధ్యం పూర్తిగా లోపించడంతోపాటు వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండి సైడు కాలువల నుంచి ప్రధాన కాలువల వరకు మురుగునీటితో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. నగరంలోని పలు ప్రధాన కాలువల నుంచి వెళ్లే మురుగునీరు కొరమేనుగుంట మీదుగా పూలవానిగుంట, గొల్లవానిగుంట మీదుగా వెళ్లే ప్రధాన కాలువలో కలుస్తాయి. కొరమేనుగుంట సమీపాన కాలువ భూములను గతంలో కొందరు ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపట్టడంతో ఈ కాలువల్లో నీటితోపాటు వ్యర్థాలు వెళ్లే అవకాశం లేక ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.దీంతోపాటు గొల్లవానిగుంట, ఆటోనగర్, రాజీవ్‌గాంధీకాలనీ ప్రాంతాల్లో కూడా సైడు కాలువల్లో నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వీటివలన 2వ వార్డు పరిధిలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు ఓ పక్క దుర్వాసన భరించలేక మరో పక్క దోమల బెడదను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వారు లేరని వారు వాపోతున్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

తిరుపతి(ఆటోనగర్), జూలై 7: రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. తిరుపతి యశోదనగర్‌లో ఆదివారం జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు సమ్మె చేశామన్నారు. ఆ సమయంలో ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో కొన్ని ఒప్పందాలు జరిగాయన్నారు. ఆ ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్ష మంది ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ మేరకు సంబంధిత మంత్రికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. రాష్ట్రంలో స్కీమ్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని ఆమె వెల్లడించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మలీల, వాణీశ్రీలు పాల్గొని ప్రసంగించారు.

కౌలు రైతు సంఘం అధ్యక్షుడిపై దాడి తగదు

తిరుపతి(ఆటోనగర్), జూలై 7: పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కామినేని రామారావుపై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం అనాగరిక చర్య అని తిరుపతి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. అర్హులైన సామాజిక పింఛన్‌దారులకు ఆగిన పింఛన్లు ఇప్పిస్తున్న రామారావుపై అధికార పార్టీకి చెందిన వారు కక్ష గట్టి దాడి చేయడం తగదన్నారు. రైతులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



తిరుపతి(వైద్యం), జూలై 7: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో రేణిగుంటలోని శ్రీబాలాజీ మెడికల్ కళాశాల, ఆస్పత్రి వారి సహకారంతో స్థానిక ఇందిరానగర్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. దాదాపు 2 వేల మందికి పైగా ప్రజలు పాల్గొని ఉచిత వైద్య శిబిరంలోని సేవలను వినియోగించుకున్నారు. నేతలు విశ్వనాథం, రాజారామ్, ఆనంద్, రాణెమ్మ, వరప్రసాద్ పాల్గొన్నారు.

బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

తిరుపతి అర్బన్, జూలై 7: స్థానిక కొర్లగుంట కార్యాలయంలో బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో ఆదివారం కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శేఖర్, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, గౌరవ సలహాదారుగా అల్లా బాషా, ప్రధాన కార్యదర్శిగా జే రమణ, కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా ఈ రాము, సభ్యులుగా విజయకుమార్, తులసిరామిరెడ్డి, శ్రీనివాసులు, హరి, రెడ్డెప్ప, కృష్ణ, జయచంద్రలు నియమితులయ్యారు.

జ్యుడీషియల్ సర్వీసెస్ అకాడమీ ప్రారంభం



అకాడమీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

తిరుపతి(లీగల్), జూలై 7: రేణిగుంట రోడ్డులో ఎస్.ఎల్ జ్యుడీషియల్ సర్వీసెస్ అకాడమీని ఆదివారం ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్, జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.గురునాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిలో అకాడమిని ప్రారంభించడం శుభపరిణామమన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జడ్జిల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ అకాడమీలో ఇచ్చే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు జి.రామ్‌గోపాల్, జి.అర్చన, అకాడమీ డైరెక్టర్లు యండమూరి నాగేంద్ర బాబు, శరణ్‌కుమార్, తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపీచంద్, సీనియర్ న్యాయవాది నెల్లూరు యోగానంద్, వేమా వెంకటరత్నం, కృష్ణయ్య, సీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో పోలీసుల విస్తృత తనిఖీలు



చెర్లోపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 7: తిరుపతిలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఎంఆర్‌పల్లి సీఐ అహ్మద్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది ఆదివారం అన్ని ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేపట్టారు. మరోవైపు రోడ్లపై పోలీసులు కనిపిస్తుండడంతో దొంగలు, అల్లరిమూకల్లో భయాందోళన మొదలైంది. రాత్రి 8 గంటల పైన మద్యం తాగి రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. తనపల్లి, పేరూరు, ఆర్‌సీపురం క్రాస్ రోడ్డు ప్రాంతాలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలీసులు అన్ని వాహనాలనూ తనిఖీ చేశారు. లైసెన్సులు లేని వారు, తాగి నడిపేవారిపై కేసులు నమోదు చేశారు.

జనసేనలో చిచ్చురేపిన రుయా వర్కింగ్ చైర్మన్ పదవి

● ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వైసీపీ నాయకుడికి ఎమ్మెల్యే సిఫారసు

● సీనియర్లకే ఇవ్వాలని జనసైనికుల పట్టు

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతిలోని ఎస్వీఆర్ రుయా ఆస్పత్రి డెవలప్మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) వర్కింగ్ కమిటీ చైర్మన్ పదవి జనసేనలో చిచ్చురేపింది. ఎన్నికలకు ముందు జనసేనలో చేరిన వైసీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతిని సిఫారసు చేస్తూ ఎమ్మెల్యే లేఖ ఇవ్వడంతో దుమారం రేగింది. వైసీపీ హయాంలో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఉన్న పోకల అశోక్ కుమార్ వద్ద పీఆర్వోగా పనిచేసిన లక్ష్మీపతి.. వైసీపీ యువజన విభాగం బాధ్యతలు స్వీకరించారు. వైసీపీ అధినాయకత్వానికి అనుకూలంగా, అప్పటి ప్రతిపక్షపార్టీ టీడీపీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తరుచూ పోస్టులు పెట్టేవాడు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర తిరుపతికి చేరిన సందర్భంలో నిరసన తెలిపిన వైసీపీ శ్రేణుల్లో ఇతను కూడా ఉన్నాడు. అయితే ఆరణి శ్రీనివాసులు ఎన్డీఏ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆయన సమక్షంలోనే మార్చి 30న జనసేనలో చేరారు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించగానే రుయా ఆస్పత్రి వర్కింగ్ కమిటీ చైర్మన్ కావాలని పట్టుబట్టి తిరిగారు. బలిజ సంఘం ప్రతినిధుల దగ్గరకు వెళ్లి సిఫారసు లేఖలు కూడా తీసుకుని ఎమ్మెల్యే కార్యాలయనికి ఇచ్చినట్టు చెబుతున్నారు. అదేవిధంగా గతలో రుయా వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన బండ్ల చంద్రశేఖర్ రాయల్ తనకు సమీప బంధువు అవుతారని, అయినా తమ ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని చెప్పుకుంటున్నట్టు తెలియవచ్చింది.

తాను చైర్మన్ అయితే రుయా ఆస్పత్రిలో అతను చేసిన అవినీతి, అక్రమాలను వెలికితీస్తానని ఎమ్మెల్యే వర్గీయులను నమ్మించి.. లేఖ తీసుకున్నట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఆ లేఖను తీసుకుని కలెక్టర్‌ను కూడా కలిశారని, రుయా వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కోరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో మూడ్రోజుల కిందట జనసేన నాయకులు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. పదేళ్లుగా పార్టీ కండువా కప్పుకుని రోడ్లపై పోరాటాలు చేసిన నాయకులను కాదని ఎన్నికల సమయంలో వచ్చినవారికి నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ.. ఎమ్మెల్యే వర్గీయులతో తీవ్ర వాగ్వాదాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. జనసేన నాయకులే కాకుండా టీడీపీ నుంచి కూడా ఆ పదవి కోసం ఆశావహులు పెద్దఎత్తున ఉన్నారు. పార్టీకి ప్రాణంపెట్టి పనిచేసిన కార్యకర్తలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అలా కాకుండా ఇష్టమొచ్చినవారికి, చుట్టూ చేరి భజన చేసినవారికి నామినేటెడ్ పదవులు కట్టబెడితే పార్టీ అధిష్టానాల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని కూటమి నేతలు హెచ్చరిస్తున్నారు. దీంతో రుయా పదవిని తాత్కాలికంగా ఆపే ఆలోచనలో ఎమ్మెల్యే వర్గం ఉన్నట్టు తెలిసింది.

తిరుపతి-కాట్పాడి రైలు మార్గంలో రెండో లైన్ మంజూరు

● త్వరలో పాకాల జంక్షన్‌కు మహర్దశ

తిరుపతి (సెంట్రల్), జూలై 7: తిరుపతి-కాట్పాడి రైలు మార్గంలోని పాకాల రైల్వే జంక్షన్‌కు త్వరలో మహర్దశ రానుంది. ఈ మార్గంలో పాకాల రైల్వే జంక్షన్ నుంచి ధర్మవరం, తిరుపతి, కాట్పాడి స్టేషన్లకు సింగిల్ లైన్‌లో రైళ్ల రాకపోకలు అధికసంఖ్యలో జరుగుతున్నాయి. రెండవ రైలు మార్గం లేని కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రైల్వే ఉన్నత అధికారులు పైమూడు మార్గాల నుంచి పాకాల జంక్షన్ మీదుగా రెండవ లైను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ధర్మవరం నుంచి పాకాల మీదుగా కాట్పాడికి రెండవ రైలు మార్గం ఏర్పాటు చేయడానికి అధికారులు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. తిరుపతి-పాకాల మధ్య సర్వేలతో ఆగివున్న రెండవ లైను మార్గం పనులను పునఃప్రారంభించాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. ఇటీవల జోనల్ స్థాయి సేఫ్టీ అధికారులు సర్వే కూడా జరిపారు. ఈ మార్గంలో రైళ్ల సంఖ్య పెరిగితే పాకాల జంక్షన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం వుంది. ప్రధానంగా తిరుపతి-కాట్పాడి మధ్య సుమారు 70 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రోజు వారీగా రాక పోకలు సాగిస్తున్నాయి. ధర్మవరం-పాకాల-కాట్పాడిల మధ్య రెండో రైలు మార్గం ఏర్పాటుతో పాటు తిరుపతి-పాకాల రైల్వే జంక్షన్ల మధ్య కూడా 42 కిలోమీటర్లు దూరం రెండవ రైలు మార్గం పూర్తి చేస్తే, మూడు వైపుల నుంచి పాకాల రైల్వే జంక్షన్‌కు రైళ్ల తాకిడి పెరిగే అవకాశం ఉంది. దీంతో పాకాల రైల్వే జంక్షన్‌కు మహర్దశ రానుంది.

తాగిన ఉద్యోగిపై సస్పెన్షన్ ఎత్తివేత !

● రుయా అధికారుల తీరుపై పలు విమర్శలు

తిరుపతి(వైద్యం), జూలై 7: రుయాస్పత్రిలో తాగి విధులు నిర్వర్తిస్తున్నాడని ఓ ఉద్యోగిపై చేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడం విమర్శలకు దారితీస్తోంది. ఈ ఏడాది మార్చిలో ఇక్కడి వాటర్‌మ్యాన్ బయట వ్యక్తితో కలిసి ఆస్పత్రిలో మద్యం తాగుతూ పట్టుబడ్డాడు. ఈ విషయం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో వెంటనే అధికారులు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అయితే రెండు రోజుల కిత్రం సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో ఆధారాలతో పట్టుబడినా ప్రైవేటు వ్యక్తి మాత్రమే తాగాడని అధికారుల నివేదికలో పేర్కొనడంపై పలు సందేహాలు కలుగుతున్నాయి. సస్పెన్షన్ ఎత్తివేతకు కొందరు యూనియన్ నేతలు రుయా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసిది. విచారణ పేరుతో కొంతకాలం సాగించి తప్పుడు నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఎత్తివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎయిడెడ్ కళాశాలల సిబ్బంది సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్సీ కంచర్లను కోరిన ఉద్యోగులు



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం నాయకులు.

తిరుపతి(విద్య), జూలై 7: ఎయిడెడ్ కళాశాలల సిబ్బంది శాఖాపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆ కళాశాలల సిబ్బంది టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్సీని తిరుపతిలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జలగం రామాంజులు మాట్లాడుతూ సమస్యల గురించి వివరించారు. శాసన మండలి సభ్యుడిగా మా సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సంఘం గౌరవ సభ్యులు వెంకటసురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్రాహ్మణ సేవా సొసైటీ అధ్యక్షుడిగా బాలాజీ



నియామక పత్రాలను చూపుతున్న కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్, జూలై7:జిల్లా బ్రాహ్మణ సేవాసొసైటీ అధ్యక్షుడిగా భీమాస్ బాలాజీ నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా రామనాథం, ప్రధాన కార్యదర్శిగా సీవీ మోహనరావు, సంయుక్త కార్యదర్శిగా ఈవీఆర్‌వీ ప్రసాద్, ట్రెజరర్‌గా ఎం.కృష్ణమూర్తి, సభ్యులుగా వెంకటరమణ, డాక్టర్.వి.రాధ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం ఏర్పాటుపై కూటమి ప్రభుత్వానికి త్వరలో వినతి పత్రం సమర్పిస్తామన్నారు.

వ్యర్థాలు తొలగించండి



తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట వ్యర్థాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 7: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించే సమయంలో పడిన వ్యర్థాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా తిరుపతి రైల్వే స్టేషన్ ముఖద్వారం ఎదుట వున్న వ్యర్థాలతో ప్రయాణికులు స్టేషన్ లోపలకు బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టేషన్ ముఖద్వారం పక్కన వున్న వ్యర్థాలను తొలగించాల్సిన అవసరం ఉంది.

ఏపీజీఈఏ జిల్లా మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం తిరుపతి మహిళా విభాగం నూతన కార్యవర్గం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా మహిళా విభాగం నూతన కార్యవర్గం తిరుచానూరు రోడ్డులోని ఎస్వీఆర్ మహిళా ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నికైంది. జిల్లా అధ్యక్షురాలిగా శాంతిదుర్గ, కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా హరిత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిట్టెమ్మ, ఉపాధ్యక్షురాలుగా ఈశ్వరమ్మ, మాధవి, ఫర్జానా, తేజేశ్వరి, చెంచులక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా వనజ, కావమ్మ, అరుణ, చందన, చెంచులక్ష్మి, కృష్ణవేణి తదితరులను ఎన్నుకున్నారు. ఈ ఎంపిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జరిగింది. నూతనంగా ఎన్నికైన మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల గౌరవాన్ని పెంపొందించడం, పరిపూర్ణ భద్రత కల్పించడం, సామర్థ్యం, నైపుణ్యాన్ని పెంచడానికి కృషి చేస్తామన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి : విజయశ్రీ



తైక్వాండో పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విజయశ్రీ

నాయుడుపేట, జూలై7: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతోపాటు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాయుడుపేటలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు రఫీ, ఉయ్యాల ప్రవీణ్, రాజేష్, పార్థసారథి, కుబేరు మణి, పి.భాస్కర్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్, జూలై 7: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎల్ఏసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతి, నెల్లూరు ఉమ్మడి జిల్లాల సంయుక్త కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం వెంకటేశ్వర్లుతోపాటు గౌరవ అధ్యక్షుడిగా బి.రవికుమార్, ప్రధాన కార్యర్శిగా విజయకుమార్, జాయింట్ సెక్రటరీగా చెంచయ్య, కోశాధికారిగా సూర్యారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా షేక్ జాహిదా, ప్రధాన కార్యదర్శిగా శ్రావణి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లకు శాలువాకప్పి, పూలమాలతో సన్మానించారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, జూలై 7: గూడూరు గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు ఆదివారం పూజలు



చిల్లకూరు, జూలై 7: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

డక్కిలి, జూలై 7: మండలంలోని తిమ్మాయపాళెంలోని గుర్రప్ప ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

కోటమ్మకు పుష్పాలంకరణ



కోట, జూలై 7: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

పెళ్లకూరు, జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఉచిత ఇసుక విధానాన్ని మండలంలో పారదర్శకంగా అమలు చేస్తామని తహసీల్దార్ కేవీ ఆర్వీ ప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి రెవెన్యూ, పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖల సమన్వయంతో పని చేస్తాయని మండల పరిధిలోని స్వర్ణముఖినదిలో ఏర్పాటు చేయనున్న రీచ్‌లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇసుక అవసరమైన ప్రతి ఒక్కరూ ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న రీచ్‌ల వద్ద గట్టి నిఘా ఉంటుందన్నారు. కాగా స్వర్ణముఖిదిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాగు, సాగునీటి బోర్లు పాయింట్ల ప్రాంతాల్లో తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినాన్ని సద్వినియోగం చేసుకోండి

గూడూరు, జూలై 7: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా విజ్ఞప్తుల దినాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా ఓడూరు

చిల్లకూరు, జూలై 7: మండలంలోని ఏరూరులో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీలో ఓడూరు జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఓడూరు- మోమిడి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఓడూరు జట్టు నిర్ణీత 8 ఓవర్లల్లో 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన మోమిడి జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసి లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.

10న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఈనెల 10వ తేదీన అయోధ్యకాండ 12వ విడత అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎస్వీ వేద విజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పాల్గొననున్నారు. అయోధ్యకాండలోని 45 నుంచి 49 సర్గలలోని 141 శ్లోకాలను పారాయణం చేస్తారు. ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ శ్లోక పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

తాగిన ఉద్యోగిపై సస్పెన్షన్ ఎత్తివేత !

రుయా అధికారుల తీరుపై పలు విమర్శలు

తిరుపతి(వైద్యం), జూలై 7: రుయాస్పత్రిలో తాగి విధులు నిర్వర్తిస్తున్నాడని ఓ ఉద్యోగిపై చేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడం విమర్శలకు దారితీస్తోంది. ఈ ఏడాది మార్చిలో ఇక్కడి వాటర్‌మ్యాన్ బయట వ్యక్తితో కలిసి ఆస్పత్రిలో మద్యంతాగుతూ పట్టుబడ్డాడు. ఈవిషయం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో వెంటనే అధికారులు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అయితే రెండు రోజుల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో ఆధారాలతో పట్టుబడినా ప్రైవేటు వ్యక్తి మాత్రమే తాగాడని అధికారుల నివేదికలో పేర్కొనడంపై పలుసందేహాలు కలుగుతున్నాయి. సస్పెన్షన్ ఎత్తివేతకు కొందరు యూనియన్ నేతలు రుయా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. విచారణపేరుతో కొంతకాలం సాగించి తప్పుడు నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఎత్తివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాళంగిని కాటేస్తున్న కాలుష్యం

నిద్రమత్తులో నీటిపారుదల శాఖ

సూళ్లూరుపేట, జూలై 7: నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిన కాళంగి నేడు కాలుష్యం కాటేస్తుండడంతో నీరంతా కలుషితంగా మారిపోయి ప్రమాదంలో పడింది.

తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల రైతులు వేలాది ఎకరాల్లో కాళంగి నీటి పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇటు సాగు నీరే కాకుండా సూళ్లూరుపేట పట్టణంలో వేసవిలో కాళంగి నది తాగునీటికి ఎంతో ఉపయోగపడుతోంది. దీనికి అనుసంధానంగా నెర్రికాలువ, పాముల కాలువ, పుచ్చాకాలువ ఉన్నాయి. ఈ కాలువల మీదుగా దాదాపు 18 చెరువులకు నీరందుతోంది. జిల్లాలోని కాళంగి నుంచి ప్రారంభమయ్యే నది బీఎన్‌కండ్రిగ మండలం మీదుగా ప్రవహించి సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డు గుండా తడ మండలం వాటంబేడు వద్ద ముగుస్తుంది. ఇంతటి చరిత్ర ఉన్న కాళంగి నది మనుగడ నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సమీపంలో కాళంగిని ఆనుకొని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో వినియోగించే తడి, పొడి చెత్త మొత్తం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వేలాది టన్నుల చెత్తంతా నదిలోకి జారీ నీరంతా కలుషితమవుతోంది. ప్రస్తుతం కాళంగిలో ఎక్కడ చూసిన



కాలువలోకి జారుతున్న డంపింగ్ యార్డు వ్యర్థాలు

ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, బాటిళ్లు చేరుతున్నాయి. ఇటు తాగు అటు సాగు నీటికి ఉపయోగించే కాళంగి నీరు నేడు రంగు మారింది.

పట్టించుకోని అధికారులు...

నదిని పరిరక్షించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. రైతులు, ప్రజలు పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. డంపింగ్ యార్డును కాళంగి నది కాలువ ప్రాంతం నుంచి తరలించాలని అనేకసార్లు విన్నవించుకున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. ఒకప్పుడు ఏడాది పొడవునా నీరుండే కాళంగి నేడు వర్షాకాలంలోనే నీరు పోరుతోంది.

నదిలో కలుస్తున్న మురుగు

చెత్త, వ్యర్థాలే కాకుండా పట్టణ మురుగునీరు పలుచోట్ల నదిలో కలుస్తోంది. దీనికి తోడు వాటంబేడు వద్ద పులికాట్‌కు, కాళంగికి మధ్య ఉన్న గ్రాయిన్ దెబ్బతినడంతో భూగర్భ జలాలు ఉప్పుగా మారిపోతున్నాయి. దీంతో సాగు నీరందక రైతులు లబోదిబోమంటున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు కాళంగిని కాలుష్య కోరలనుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉంది.



నదిలో ప్రవహిస్తున్న రంగు మారిన నీరు

ఎండమావిగా ప్రభుత్వ వైద్య సేవలు

బాలాయపల్లి పీహెచ్‌సీలో రోజురోజుకు తగ్గుతున్న ఓపీలు



బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - రోగులు రాక ఖాళీగా ఉన్న సిబ్బంది - వార్డులో మంచం కింద పేర్చిన అట్టపెట్టెలు

బాలాయపల్లి, జూలై 7: మండలంలోని పేదలకు ప్రభుత్వ వైద్య సేవలు ఎండమావిగా తయారయ్యాయి. 24 పంచాయతీలకు వైద్య సేవలందించేందుకు బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు నామమాత్రంగా అందుతున్నాయి. దీంతో ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 40వేల మంది జనాభా ఉన్నారు. బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అలసత్వంతో వైద్యసేవలు అందడంలేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలను గ్రామీణులు ఆశ్రయించాల్సిన దుస్థితి. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులున్నారు. ఒకరు 104 వాహనంలో గ్రామాలకు వెళ్లాల్సి ఉండగా మరొకరు ఆసుపత్రిలో ఉండి రోగులను పరీక్షించి వైద్యం అందించాల్సి ఉంది. అయితే 104 వాహనం వీలును బట్టి వెళ్లడం పరిపాటిగా మారిందని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. బాలాయపల్లిలో ఉన్న ఆసుపత్రి మండలంలోని కొన్ని గ్రామాలకు దూరంగా ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి చొరవతో జయంపుకు ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఆసుపత్రి నిర్మాణాలు చేపట్టేవరకు ప్రజలు ఇబ్బంది పడకుండా జయంపులో ఉండి వైద్యసేవలు అందించేందుకు ఓ వైద్యురాలిని నియమించారు. అయితే జయంపులో వైద్య సేవలు అందించాల్సిన వైద్యురాలు అక్కడ ఆసుపత్రి ఏర్పాటుకు భవనంలేక పోవడంతో బాలాయపల్లి ఆసుపత్రిలోనే ఉంటున్నారు. ముగ్గురు వైద్యులు ఉన్న ఈ ఆరోగ్యకేంద్రంలో రోజుకు 50 నుంచి 70 మందికి వైద్య పరీక్షలు అందించిన దాఖలాలు లేదు. గతంలో సుమారు 150 నుంచి 200 వరకు వస్తున్న ఓపీ ప్రస్తుతం 70కి మించి లేదంటే వైద్యులు ఎలా సేవలు అందిస్తున్నారో ఇట్టే అర్థమవుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసంతో దాణా ఖర్చు తగ్గించుకోవచ్చు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ

గూడూరు, జూలై 7: పాడి రైతులు పశుగ్రాస రకాలను సాగు చేసి వినియోగించుకోవడం ద్వారా దాణా ఖర్చులను ఆదా చేసుకోవచ్చని పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. ఆదివారం ప్రాంతీయ పశు వైద్యశాలలో పశు గ్రాస వారోత్సవాలను ప్రారంభించి పాడి రైతులకు పశుగ్రాసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... పాడిరైతులు ఏకవార్షిక రకాలైన మొక్కజొన్న, జొన్న, సజ్జ, బహువార్షికాలైన పారాగడ్డి, సూపర్ నేపియర్ తదితర జాతి రకాల పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా దాణాలో పోషక విలువలు పెరిగి పాల ఉత్పత్తి పెరగడంతోపాటు దాణా ఖర్చులు తగ్గుతాయన్నారు.

కూటమికి రుణపడి ఉంటాం



చంద్రబాబు, పవన్, పాశిం చిత్రపటాలకు దివ్యాంగుల పాలాభిషేకం

కోట, జూలై 7: పింఛన్‌ను రూ.6వేల చేసి అండగా నిలిచిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు రుణపడి ఉంటామని దివ్యాంగులు చెప్పారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం పీడబ్ల్యూడీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు పింఛన్ పెంపుపై సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్, పాశిం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు జి.కృష్ణ, ఉపాధ్యక్షుడు వి.సుధీర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి టి.కోటేశ్వరరావు, సీనియర్ జనసేన నాయకుడు అల్లంబాబు, పి.మల్లికార్జున్, రమేష్, శ్రీనివాసులు, కోటయ్య, సంధాని, సుబ్బారావు, పరశురామయ్య, హరీష్ తదితరులు ఉన్నారు.

వేద వ్యాసుడిని గురువుగా పూజించాలి: ఆర్‌ఎస్ఎస్

కోట, జూలై 7: వేదాలు, ఉపనిషత్తులు రాసిన వేదవ్యాస భగవానుడిని ప్రతి భారతీయుడు గురువుగా భావించి పూజించాలని ఆర్ఎస్ఎస్ సంఘ్ సంచాలకుడు అన్నారు. కోటలోని చిన్మయామిషన్, విద్యానగర్‌లోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా సంఘ్ చాలక్ పి.ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయ ప్రముఖ్ ఏవెంకటరమణయ్య, కోటేశ్వరరావు, ధనంజయలు ప్రత్యేక పూజలు చేశారు. వేదవ్యాసుడు రాసిన వేదాలు చదివి మానవ విలువలను, సదాచారాలను పెంపొందించాలన్నారు. గురుపూర్ణిమను పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

పదవీ విరమణతో బాధ్యత తీరిపోదు

కోట, జూలై 7: ఉద్యోగులు పదవీ విరమణ అయిన తరువాత వారు ఎన్నుకున్న లక్ష్యం, బాధ్యతలు తీరవని తుదిశ్వాస వరకు సేవలను సమాజానికి ఉపయోగపడాలని అంబేడ్కర్ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ ఏ. వెంకటేశ్వర్లు అన్నారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల అటెండర్‌గా పదవీ విరమణ పొందిన శివధానం శివకుమార్‌కు ఆదివారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది శివకుమార్ దంపతులను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.


కొత్తగుంటను కమ్మేస్తున్న కాలుష్యం



కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు - కమ్మీల కోసం వైర్లను తగులబెట్టడంతో వెలువడుతున్న దట్టమైన పొగ

చిట్టమూరు, జూలై 7: మండల కేంద్రమైన చిట్టమూరులోని కూడలి ప్రాంతమైన కొత్తగుంట కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఎటూ చూసినా రోడ్డుకు ఇరువైపులా కుళ్లిన కోళ్ల వ్యర్థాలే కనబడుతున్నాయి. వ్యర్థాలను మూటలు కట్టి పడేయడంతో చెదరుమదురుగా పడుతున్న వర్షం కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. కొత్తగుంట నుంచి కోగిలి రోడ్డు, సబ్‌స్టేషన్, చిట్టమూరు చెరువు కట్ట వైపు వెళ్తున్న బైపాస్ రోడ్డు ఇరువైపులా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఆయా రహదారుల్లో వెళ్లే ప్రజలు వాసన భరించలేక ముక్కులు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా పాత సమాన్ల నుంచి ఇనుప రేకులు, వైర్ల నుంచి అల్యూమినియం, రాగి తీగల కోసం వైర్లను తగుల బెడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం చేపలు విక్రయదారులు ఆ వ్యర్థాలను, కడిగిన నీటిని గ్రామంలోనే పారబోస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం అధికారులు ఈ మార్గంలోనే తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వ్యర్థాలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని కొత్తగుంటవాసులు కోరుతున్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: విజయశ్రీ



వర్షంలో కొనసాగుతున్న విజయోత్సవ ర్యాలీ

సూళ్లూరుపేట, జూలై 7: టీడీపీ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ జరిగింది. కచ్చేరి వీధిలోని రైల్వే గేటు నుంచి సాయంత్రం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ర్యాలీ ఆసాంతం బాణసంచా పేల్చి, పూలవర్షం కురిపించారు. ర్యాలీ కూరగాయల మార్కెట్ సెంటర్ వద్దకు చేరుకుంటుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో ర్యాలీని నిలిపివేసి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అభినందన సభకు అందరూ చేరుకున్నారు. ఈ సందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లాడుతూ... అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెలవల రాజేష్, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, సీనియర్ నాయకుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, బీసీ నాయకుడు పెరుమాల్, మాధవనాయుడు, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కోటయ్య, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పాటుపడుతున్న బీజేకేపీ

- ఏపీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 7: భారత దేశ అభివృద్ధికి, దేశ సమగ్రతకు భారతీయ జవాన్ కిసాన్ పార్టీ (బీజేకేపీ) పాటుపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కోండ్రు రాజేశ్వరరావు చెప్పారు. బీజేకేపీ రాష్ట్ర కమిటీ ప్రమాణోత్సవ కార్యక్రమం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. భారత శక్తిపీఠం పీఠాధిపతి భారతీనంద మహరాజ్, వారాహి పీఠాధిపతి రుద్ర స్వామి హాజరై ఆశీస్సులతో కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ సుదర్శి మోహనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రస్తుతం పార్టీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం ప్రమాణ స్వీకారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కోండ్రు రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, కార్యదర్శిగా బి.శివప్రసాద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.కిషోర్ కుమార్, జి.కుప్పుస్వామి, సీహెచ్ శ్రావణ్‌కుమార్, ముక్కాల పాండురంగారావు, న్యాయ సలహాదారుడిగా ఎస్.రవికుమార్ ప్రమాణస్వీకారం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు

తిరుమల, జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 77,995 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 30,250 మంది తలనీలాలు సమర్పించారు. ప్రముఖ గాయని, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనురాధ పౌడ్వాల్, తెలంగాణ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు.

పంట రుణాలు.. మరింత ఆలస్యం!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఎన్నికలు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం తదితర కారణాలతో పంట రుణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందిస్తుంది. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పాలక మండళ్లు రద్దయ్యాయి. కొత్త పాలకవర్గాలను నియమించాకే పంటరుణాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైంది. ఇప్పటికే వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పంటరుణాల మంజూర్లు చురుగ్గా కొనసాగాలి. ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ బ్యాంకు ద్వారా కూడా పంట రుణాలు అందలేదు. ఈ సంవత్సరం పంటరుణాల మంజూరుకు సంబంధించి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల, జిల్లా అధికారులు ఫిబ్రవరి నెలలో సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడినుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లాకేంద్రానికి చేరింది. ఎన్నికల కోడ్, ఫలితాల విడుదల, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, కలెక్టర్ల బదిలీలు తదితర కారణాలతో ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. 2023-24లో రూ.13వేల కోట్ల పంటరుణాల పంపిణీకి బ్యాంకర్ల కమిటీ లక్ష్యం నిర్ణయించగా, రూ.14వేల కోట్ల పంపిణీ జరిగినట్లు బ్యాంకువర్గాలు తెలిపాయి. ఈ సంవత్సంలో పంట రుణాల లక్ష్యంపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంటామని ఎల్డీఎం ఎ.హరీష్ ఆదివారం తెలిపారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

రూ. 3.28 లక్షల సరుకు సీజ్



వెంకటగిరి పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ

వెంకటగిరి టౌన్, జూలై 7: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలని ఏడీఏ ఎస్.పీ.ఎల్లప్ప దుకాణ యజమానులకు సూచించారు. ఆదివారం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో పురుగు మందుల దుకాణాలను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనుమతి లేని పురుగుమందులను విక్రయించరాదన్నారు. ఎమ్మార్పీకే విక్రయంచకపోతే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా 6ఏ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పలు షాపుల్లో అనుమతి పత్రాలు లేకుండా ఫాం'O' లైసెన్సు కానందున రూ.3.28లక్షల ఎరువులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి జీవానందం, వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్, ఈఎస్ వరప్రసాద్, శిరీషా పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత

ఆందోళనలో ఉన్నతాధికారులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 7: జిల్లా ఆర్టీసీ పరిధిలో కాలక్రమేణ డ్రైవర్ల కొరత తీవ్రతరమవుతోంది. దీనివల్ల రోజూ వంద బస్సులకుపైగా డిపోలకే పరిమితమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 11డిపోలు (తిరుమల, అలిపిరి, తిరుపతి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడు)న్నాయి. అన్ని డిపోలకు కలిపి 857 వివిధ రకాల బస్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నడపడానికి 2,100మంది డ్రైవర్లు ఉండేవారు. గత ఫిబ్రవరి నుంచి డ్రైవర్ల పదవీ విరమణ ప్రారంభమైంది. డిపోకు పది చొప్పున ఇప్పటికే సుమారుగా 250మంది వరకు పదవీ విరమణ చేశారు. వీరి స్థానాలు భర్తీ కాలేదు. దీనివల్ల తాత్కాలికంగా ఆన్‌కాల్ డ్రైవర్‌ను వినియోగించుకోవాల్సి వస్తోంది. అయితే ఈ పనికోసం తమకు ఇచ్చే గౌరవ వేతనం తక్కువగా ఉంటోందని ఆన్‌కాల్ డ్రైవర్లు నిలకడగా రావడం లేదు. దీనివల్ల 11 డిపోల్లో నిత్యం పది బస్సుల చొప్పున రోడ్డెక్కడం లేదు. ప్రధాన మార్గాలు, గ్రామాలకు బస్సుల ట్రిప్పులు తగ్గిపోతున్నాయి. తద్వారా పాతికవేల మంది ప్రయాణికులు ప్రజారవాణాను కోల్పోతున్నారు. విధిలేక ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి.. అధిక చార్జీలు చెల్లిస్తూ నష్టపోతున్నారు. ఇక రోజువారీ జిల్లా రాబడిలోనూ ఆర్టీసీకి దాదాపు రూ.25లక్షలు తగ్గుతోంది. ఈసమస్య ఉన్నతాధికారులను కలవరపెడుతోంది.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,861మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,311మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,791మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,263, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 329మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 245మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 79మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,682అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వర్షం పడితే... వీధులన్నీ చెరువులే



పోస్టాఫీసు వీధిలో వర్షపునీరు

రేణిగుంట, జూలై 7: రేణిగుంట పట్టణంలో వర్షం పడితే వీధులన్నీ చెరువుల్లా మారుతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన మోస్తారు వర్షానికి రైల్వేస్టేషన్ ఆవరణలోని జీపు స్టాండ్, పోస్టాఫీసు వీధి, పట్టణంలోని కొన్ని ప్రధాన వీధులు వర్షపునీటితో నిండిపోయి చిన్నపాటి చెరువులను తలపించాయి. దీనికి తోడు మురుగుకాలువలు వర్షపు నీటితో నిండిపోయి వర్షాలు రోడ్డుపై పారడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా రేణిగుంట పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరు వీధుల్లో పారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ వ్యవస్థను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కావమ్మ, మారయ్యకు వెండి కిరీటాల బహూకరణ

శ్రీకాళహస్తి, జూలై 7: పట్టణంలోని సంత మైదానం సమీపంలో వెల సిన కావమ్మ, మారయ్య స్వామివార్లకు పట్టణానికి చెందిన కాత్రపల్లి గోపి, రాజ్యలక్ష్మి దంపతులు ఆదివారం వెండియ కిరీటాలను బహూకరించారు. వాటిని ఆలయ నిర్వాహకులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహారావు

శ్రీకాళహస్తి, జూలై 7: హెల్మెట్ ధారణతో ప్రాణాలను రక్షించుకోవచ్చని వన్ టౌన్ సీఐ నరసింహరావు అన్నారు. పట్టణంలోని సూపర్‌బజారు కూడలి వద్ద హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహన దారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయణించే ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త గొల్లకండ్రిగలో గంగజాతర



పిచ్చాటూరు, జూలై 7: మండలంలోని తులసికృష్ణాపురం పంచాయతీ కొత్త గొల్ల కండ్రిగలో గంగజాతర వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు ఆదివారం గ్రామదేవతలు అలంకాళపరమేశ్వరి, గంగమ్మ, చెల్లెమ్మలకు వేట పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు చేసి పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యం సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి గ్రామ పొలిమేరల వద్ద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రవేత్త జాతర చాటింపు నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

విలేకరులతో దురుసుగా ప్రవర్తించిన

హోంగార్డుపై చర్యలు తీసుకోండి

డీఎస్పీకి ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు



డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

పుత్తూరు అర్బన్, జూలై 7: విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ఆవేదనను రికార్డు చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, బలవంతంగా వీడియో ఫుటేజులను డిలీట్ చేయించిన హోంగార్డు జయకుమారిపై చర్యలు తీసుకోవాలని పుత్తూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఎస్పీ శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సంఘటన పూర్వాపరాలను వివరించారు. శనివారం మధ్యాహ్నం పట్టణానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఈ విషయాన్ని కవర్ చేసేందుకు ఏబీఎన్ జర్నలిస్ట్ లోకేశ్వర్, టీవీ 5 జర్నలిస్ట్ అభి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. డ్వాక్రా మహిళల ఆవేదనను స్టేషన్ మెట్ల వద్ద రికార్డు చేస్తున్న సమయంలో హోంగార్డు జయకుమారి విలేకరుల మొబైల్ ఫోన్లను లాక్కునే ప్రయత్నం చేశారు. విధి నిర్వహణలో భాగంగా స్టేషన్ బయట బాధితుల ఆవేదన రికార్డు చేస్తే తప్పేముందని సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆమె వినిపించుకోలేదు. వీడియో ఫుటేజీలను డిలీట్ చేయాలని నానాయాగీ చేశారు. అంతటితో ఆగకుండా సీఐ ఓబులేశు వద్దకు రిపోర్టర్లను తీసుకెళ్లారు. తాము బాధితుల ఆవేదనను రికార్డు చేశామని సీఐకు జర్నలిస్టులు వివరించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో చేసేది లేక వీడియో ఫుటేజీని డిలీట్ చేశామని డీఎస్పీకి వివరించారు. హోంగార్డు జయకుమారిపై తక్షణమే విచారించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఇకపై జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తించే సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా వారికి ముందుగా కౌన్సెలింగ్ కూడా ఇస్తామని చెప్పారు. డీఎస్పీని కలిసిన వారిలో జర్నలిస్టులు సుమన్, గుణశేఖర్, సురేష్, హేమనాథ్, లోకేశ్వర్, అభి, ముత్తు తదితరులు ఉన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జూలై 7: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో శివ(42) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద పిచ్చాటూరు రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పట్టణ శివారులోని బంగారమ్మ కాలనీకి చెందిన శివ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వర్క్‌ఫ్రం హోమ్ ప్రాతిపదికన పనిచేస్తుంటాడు. ఆదివారం సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో డిగ్రీ కళాశాల మైదానం ఎదురుగా పిచ్చాటూరు రహదారిపై వెళుతుండగా పంది అడ్డం వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో శివ తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

లారీ ఢీకొని స్కూటరిస్ట్‌కు తీవ్రగాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7: మండలంలోని నీర్పాకోట భారత్ పెట్రోల్ బంకు దగ్గర లారీ ఢీకొనడంతో స్కూటరిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు... గాజులపేళ్లూరు గ్రామానికి చెందిన మోహన్(29) ఆదివారం ఉదయం కేటీ రోడ్డు నీర్పాకోట సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ పట్టుకుని ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోహన్‌ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు.

పేకాట ఆడుతున్న వైసీపీ నేతల అరెస్టు

రూ.52వేల నగదు స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7: బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఎన్టీఆర్ నగర్ సమీపంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.52వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. అరెస్టయిన వారు వరదయ్యపాళెం మండలానికి చెందిన వైసీపీ నాయకులుగా తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూలై 6: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను జిల్లా ఈడిగ గౌడ బీసీ సాధికార కమిటీ అధ్యక్షుడు వాలదాసు తోయిదాక్షులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతికి విచ్చేసిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తిరకాల చిరంజీవి గౌడ్, సురగాని మునీశ్వరయ్యగౌడ్, అనగాని ఆనంద్ గౌడ్, శ్రీనివాసులగౌడ్, మాకాల దొరబాబుగౌడ్, చిరంజీవిగౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల పాలనతో ప్రశాంతత



బొజ్జల బృందమ్మను సన్మానిస్తున్న జ్యోష్న

శ్రీకాళహస్తి, జూలై 7: శ్రీకాళహస్తిలో వైసీపీ అరాచక పాలన అంతమై ప్రశాంతతకు మారుపేరైన బొజ్జల పాలన రావడం సంతోషకరమని టీడీపీ ఐటీ ప్రొఫెషనల్స్ వింగ్ సభ్యురాలు జోష్న అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన జ్యోష్న ఆదివారం ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డిని కలిసి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వగ్రామమైన అమ్మపాళెంలో వైసీపీ నేతలు ప్రజలను బెదిరింపులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో అరాచక పాలన నుంచి విముక్తి లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడల్లో యువత రాణించాలి



మంగళం జట్టుకు బహుమతి అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు, జూలై 7: క్రీడల్లో యువత రాణించాలని మన్నసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. మన్నసముద్రం యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గత నెల 22వ తేదీన ప్రారంభించారు. టోర్నీలో 30 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మంగళం, మన్నసముద్రం తలపడ్డాయి. విజేతగా నిలిచిన మంగళం జట్టుకు రూ.10వేలు, రన్నర్ మన్నసముద్రం జట్టుకు రూ.7వేలు బహుమతిగా అందజేశారు. ప్లేయర్ ఆఫ్ సిరీస్‌గా చంద్ర, ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా అజిత్‌కుమార్ నిలిచారు.

తాగునీరు కలుషితం

కేవీబీపురం, జూలై 7: మండలంలోని పాతపాళెంలో తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. బోరు చుట్టూ ప్లాట్‌ఫారం లేకపోవడంతో మురుగు నీరు చేరి బోరులోకి వెళ్లి తాగునీరు కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి బోరు చోట్టు ప్లాట్‌ఫారం నిర్మించాలని కోరుతున్నారు.





అసంపూర్తిగా ఉన్న గోళ్లవారికండ్రిగ పాఠశాల భవనం - ప్రహరీ లేని టీపీపాళెం పాఠశాల

నాడు నేడు పనుల్లో వైసీపీ సర్పంచ్ హవా

పనులు పూర్తి కాకుండానే సగం బిల్లుల స్వాహా

సత్యవేడు, జూలై 7: నాడు - నేడు పనుల్లో ఓ వైసీపీ సర్పంచ్ హవా కొనసాగించారు. పనులు పూర్తి చేయకుండానే సొమ్ము దక్కించుకున్నారు. నాగలాపురం మండలం టీపీపాళెం, గోళ్లవారికండ్రిగ పాఠశాలల్లో నాడు - నేడు రెండవ విడత పనులు ప్రారంభించి రెండేళ్లవుతోంది. ఇప్పటికీ పూర్తి కాలేదు. పాఠశాల విద్యాకమిటీ ఈ పనులు నిర్వహించాల్సి ఉంది. కానీ టీపీపాళెం పంచాయతీ సర్పంచ్, వైసీపీ నేత పళణి అన్నీతానై పనులు చేపట్టడం గమనార్హం. విద్యా కమిటీ సభ్యులను, అధికారులను బెదిరించి వారి పేరుమీద ఈ పనులను చేపట్టినట్లు సమాచారం. అధికారం అడ్డం పెట్టుకుని పనులు పూర్తి చేయకుండానే సగం బిల్లులు డ్రా చేసేశారు. ఈయన నిర్వాకంతో ఇప్పుడు పాఠశాలలో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా గోళ్లవారి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో కాంపౌండ్ వాల్, కిచెన్‌షెడ్, మరుగుదొడ్ల మరమ్మతులు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఫర్నిచర్ ఏర్పాటుకు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.5 లక్షలు చెల్లించారు. పనులు సగం కూడా జరగలేదు. టీపీపాళెం పాఠశాలలోనూ పనులు అరకొరగానే ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ రెండు పాఠశాలల్లో పనులపై విచారణ జరిపాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించండి: ఆదిమూలం

వరదయ్యపాళెం, జూలై 7: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని చిన్నపాండూరు ఆస్పత్రిని ఆదివారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించి సక్రమంగా విధులకు హాజరు కాని యూడీసీ, అటెండర్, సమయపాలన పాటించని వైద్యసిబ్బంది గురించి కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ఆస్పత్రిలో వైద్యసిబ్బంది మధ్య వివాదంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆస్పత్రిని భ్రష్టు పట్టించడం సరికాదన్నారు. విధులకు గైర్హాజరవుతూ వైద్యసేవలందించడంతో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 20 నెలలుగా జీతాలు రాలేదని నర్సు సునీత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారులతో మాట్లాడి జీతం వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ మాజీ డైరెక్టర్ దశరథయ్య, నాయకులు నాగార్జున, ఆదిశేషు, గురవయ్య, యుగంధర్‌రెడ్డి, ఆజయ్, నరేష్, వెంకటేష్, రోశయ్య, పవన్, తులసి, గుత్తి త్యాగరాజు, అభి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

హంస వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూలై 7: మండల కేంద్రంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వీణా దక్షిణామూర్తి అవతారంలో హంస వాహనంపై ఊరేగారు. వేకువజామున స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. వేదమంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7గంటలకు చంపక వల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి హంస వాహనంపై అధిరోహించి వీణా దక్షిణామూర్తి అవతారంలో పురవీధుల్లో ఊరే గించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి దర్శించు కున్నారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్, అర్చకులు రమేష్, రమణి, గౌతమ్ పాల్గొన్నారు.

రవాణా శాఖలో సర్వర్ సమస్య

తిరుపతి (జీవకోన), జూలై 7: జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సర్వర్ సమస్యతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల రెండు పర్యాయాలు సర్వర్ సమస్య రావడంతో ఎల్ఎల్ఆర్, డీఎల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నిరీక్షణ తప్పడంలేదు. గంటల కొద్దీ వేచి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సర్వర్ అందుబాటులోకి లేకపోవడంతో మరుసటి రోజు మళ్లీ పరీక్షలకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో ఈ ప్రగతి సాఫ్ట్‌వేర్ రవాణాశాఖకు అందుబాటులో ఉండేది. అయితే దేశవ్యాప్తంగా ఒకే సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంచాలని రవాణా శాఖ తలచింది. దీంతో నూతనంగా సారథి పరివాహన పోర్టల్‌లో డ్రైవింగ్ లైసెన్సులు, వాహన పరివాహన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. లైసెన్సులకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్ పూర్తిగా అందుబాటులో ఉన్నప్పటికీ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసే సాఫ్ట్‌వేర్‌లో మాత్రం సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. పాత వాహనాలకు సంబంధించిన పూర్తి డేటాను కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచలేదు. దీంతో పాత వాహనాలకు సంబంధించిన ప్రక్రియ చేసుకునే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. టెక్నికల్ సమస్యలు వచ్చిన సమయంలో మోడిఫికేషన్ చేసినపుడు సమస్య ఏర్పడుతూనే ఉంది. మరోపక్క ఆధార్ సర్వర్లు డౌన్ అవ్వడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా కూడా అలాగే ఉంది. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్సు పరీక్షల కోసం, ఇతర సేవల కోసం హాజరయ్యే వాహనదారులకు ఎలాంటి నిరీక్షణ లేకుండా చూడాల్సిన బాధ్యత రవాణాశాఖ ఉన్నతాధికారులపై ఉంది.

ఏపీజీఈఏ జిల్లా మహిళా విభాగ కార్యవర్గం ఎన్నిక



తిరుపతి(కలెక్టరేట్), జూలై 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా మహిళా విభాగం నూతన కార్యవర్గం తిరుచానూరు రోడ్డులోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షురాలిగా శాంతిదుర్గ, కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా హరిత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిట్టెమ్మ, ఉపాధ్యక్షురాలుగా ఈశ్వరమ్మ, మాధవి, ఫర్హానా, తేజేశ్వరి, చెంచులక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా వనజ, కావమ్మ, అరుణ, చందన, చెంచులక్ష్మి, కృష్ణవేణి తదితరులను ఎన్నుకున్నారు. ఈ ఎంపిక కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జరిగింది. నూతనంగా ఎన్నికైన మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల గౌరవాన్ని పెంపొందించడం, పరిపూర్ణ భద్రత కల్పించడం, సామర్థ్యం, నైపుణ్యాన్ని పెంచడానికి కృషి చేస్తామన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

వరదయ్యపాళెం, జూలై 7: మండల కేంద్రంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెట్, డీఎస్సీకి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరదయ్యపాళెంలోని డీసీసీ బ్యాంకు పక్కన సోమవారం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 4నుంచి రాత్రి 9గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు 9642588467 నెంబరును సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

వరదయ్యపాళెం, జూలై 7: అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన గిరిజన బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని పాండూరు పంచాయతీ వెంకటేశ్వర ఎస్టీకాలనీకి చెందిన బుజ్జమ్మ కుటుంబానికి రూ.10వేలు, ఇందిరానగర్‌కు చెందిన స్వప్న కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం ద్వారా బియ్యం పంపిణీ చేశారు. కాగా, వెంకటేశ్వర కాలనీలో సమస్యలపై స్థానికులు విన్నవించగా ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభారతి, ఎస్ఐ ప్రతాప్, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, జయచంద్ర నాయుడు, నరసరాజు, దశరథన్, సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు, నాగరాజు యాదవ్, కరుణాకర్ నాయుడు, దశరథయ్య, పవన్, మహేష్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనునాయుడు, మునిభూషణమ్మ, జనసేన నాయకులు చిరంజీవి యాదవ్, తులసి, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, దిలీప్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీవిద్య బాధితులను ఆదుకోండి

వరదయ్యపాళెం, జూలై 7: జగన్ పాలనలో విదేశీ విద్య పథకం కింద సాయం అందక నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని వరదయ్యపాళెం మండల టీడీపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఆదివారం మంగళగిరిలో టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగు మహిళా నాయకురాలు మహాలక్ష్మి మాట్లా డుతూ గత టీడీపీ హయాంలో చంద్రబాబు అమలు చేసిన విదేశీ విద్య పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఆపేయడంతో విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ విద్య పథకాన్ని పున రుద్ధరించి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు చెప్పారు.

తిరుపతి - కాట్పాడి రైలు మార్గంలో రెండో లైన్ మంజూరు

తిరుపతి (సెంట్రల్), జూలై 7: తిరుపతి - కాట్పాడి రైలు మార్గంలోని పాకాల జంక్షన్‌కు త్వరలో మహర్దశ రానుంది. ఈ మార్గంలో పాకాల రైల్వే జంక్షన్ నుంచి ధర్మవరం, తిరుపతి, కాట్పాడి స్టేషన్లకు సింగిల్ లైన్‌లో రైళ్ల రాకపోకలు అధికసంఖ్యలో జరుగుతున్నాయి. రెండవ రైలు మార్గం లేని కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రైల్వే ఉన్నతాధికారులు పైమూడు మార్గాల నుంచి పాకాల జంక్షన్ మీదుగా రెండవ లైను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ధర్మవరం నుంచి పాకాల మీదుగా కాట్పాడికి రెండవ రైలు మార్గం ఏర్పాటు చేయడానికి అధికారులు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. తిరుపతి - పాకాల మధ్య సర్వేలతో ఆగివున్న రెండవ లైను మార్గం పనులను పునఃప్రారంభించాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. ఇటీవల జోనల్ స్థాయి సేఫ్టీ అధికారులు సర్వే కూడా జరిపారు. ఈ మార్గంలో రైళ్ల సంఖ్య పెరిగితే పాకాల జంక్షన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం వుంది. ప్రధానంగా తిరుపతి - కాట్పాడి మధ్య సుమారు 70 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రోజు వారీగా రాక పోకలు సాగిస్తున్నాయి. ధర్మవరం - పాకాల - కాట్పాడి మధ్య రెండో రైలు మార్గం ఏర్పాటుతో పాటు తిరుపతి - పాకాల రైల్వే జంక్షన్ల మధ్య కూడా 42 కిలోమీటర్ల దూరం రెండవ రైలు మార్గం పూర్తి చేస్తే, మూడు వైపుల నుంచి పాకాల రైల్వే జంక్షన్‌కు రైళ్ల తాకిడి పెరిగే అవకాశం ఉంది. దీంతో పాకాల రైల్వే జంక్షన్‌కు మహర్దశ రానుంది.